

డీఈవోగా అప్పారావు నాయుడు బాధ్యతలు స్వీకరణ



అనకాపల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శాఖాధికారిగా గిడ్డి అప్పారావు నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం అనకాపల్లి డీఈవోగా నియమిస్తూ బదిలీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ డీఈవోగా పనిచేసిన వెంకటలక్ష్మమ్మ ఏలూరు జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. కాగా అప్పారావునాయుడు బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

వరిలో కేళీల బెడద

ఆర్‌జేఎల్-2537 రకం విత్తనాల్లో కల్తీ

- 10-15 శాతం వరకు కేళీల మొక్కలు
- ధాన్యం దిగుబడి, నాణ్యతపై ప్రభావం
- విత్తనాలను ఆర్‌బీకేల్లో కొనుగోలు చేసిన రైతులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి వినతి



పాయకరావుపేట మండలం సత్యవరంలో ఆర్‌జేఎల్-2537 రకం వరిలో కేళీల దుబ్బులు

మాకవరపాలెం/పాయకరావుపేట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

వ్యవసాయ శాఖ పాయకరావుపేట డివిజన్‌లో ఆర్‌జేఎల్-2537 (శ్రీకాకుళం సన్నాలు) రకం వరి వేసి పొలాల్లో కేళీల దుబ్బులు అధికంగా వుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో రైతు భరోసా కేంద్రాల్లో (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) ఈ రకం వరి విత్తనాలు కొనుగోలు చేశామని, విత్తనాలు కల్తీ అయిన విషయం ఇప్పుడే బయటపడిందని చెబుతున్నారు. పొలంలో 10-15 శాతం వరి దుబ్బుల్లో కేళీలు (వడ్ల గింజలు లావుగా వుండి, బియ్యం ఎర్రగా వుంటాయి) వున్నాయని, వీటి వల్ల ధాన్యం దిగుబడి తగ్గడమే కాకుండా, రైస్ మిల్లర్లు తక్కువ రేటుకు కొంటారని వాపోతున్నారు.

వ్యవసాయ శాఖ పాయకరావుపేట డివిజన్ పరిధిలో పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల, మాకవరపాలెం, నాతవరం మండలాలు వున్నాయి. నీటిపారుదల సదుపాయం వుండడంతో సుమారు 40 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. అధిక దిగుబడులతోపాటు మార్కెట్‌లో డిమాండ్ వుండడంతో ఎక్కువ మంది రైతులు ఆర్‌జేఎల్-2537 (శ్రీకాకుళం సన్నాలు) రకం వరిసాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు కొనుగోలు చేశారు. ఆకుమడులు పోసి, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వరినాట్లు వేశారు. సుమారు నెల రోజుల క్రితం పొలంలో అక్కడక్కడా కొన్ని వరి దుబ్బులు ఎక్కువ ఎత్తు పెరగడం గమనించిన రైతులు.. వరి విత్తనాల్లో కేళీలు వున్నట్టు గుర్తించారు. అయితే క్రమేపీ కేళీల దుబ్బులు అధికం అవుతుండడంతో ఆర్‌బీకేల్లో కల్తీ వరి విత్తనాలు విక్రయించినట్టు నిర్ధారణకు వచ్చారు. దీనిపై పలువురు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బందిని అడిగితే... డెల్టా సీడ్స్ అనే కంపెనీ సరఫరా చేసిన ఆర్‌జేఎల్-2537 రకం వరి విత్తనాల్లో కల్తీ వున్నట్టు గుర్తించామని చెప్పారు. ప్రతి మండలంలో 70 శాతం వరకు ఆర్‌జేఎల్-2537 రకం విత్తనాలు సాగు చేస్తున్నారు. పొలంలో అసలైన ఆర్‌జేఎల్ రకం వరి దుబ్బుల కన్నా, కేళీల వరిదుబ్బులు ఎక్కువ ఎత్తు పెరిగాయి. దీంతో పలువురు రైతులు ఒక చదరపు మీటరు విస్తీర్ణంలో వరి దుబ్బులను లెక్కించగా, పది నుంచి 15 శాతం వరకు కేళీల మొక్కలు వున్నాయి.



మాకవరపాలెం కొండల అగ్రహారంలో ఆర్‌జేఎల్ వరి రకంలో కేళీల మొక్కలు

ముమ్మాటికీ నకిలీవిత్తనాలే!

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరఫరా చేయడానికి ప్రభుత్వం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా పలు ప్రైవేటు కంపెనీలకు ఏడాది ముందుగానే ఇండెంట్ ఇస్తుంది. ఆయా కంపెనీల తరఫున అధిక దిగుబడి ఇచ్చే నాణ్యమైన వంగడాలను వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో ఫౌండేషన్ సీడ్ పేరుతో సాగు చేయిస్తుంటారు. ఆకుముడుల నుంచి పంట కోసి, నూర్పేవరకు వ్యవసాయ సిబ్బంది పర్యవేక్షిస్తారు. నూర్పిడి అనంతరం విత్తనాలను ఆయా కంపెనీలు కొనుగోలు చేస్తాయి. తదుపరి ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరఫరా చేస్తారు. కానీ ఈ ఏడాది సరఫరా చేసిన విత్తనాలు ముమ్మాటికీ నకిలీవేనని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులతో ప్రత్యేకంగా సాగు చేయించకుండా, సాధారణంగా పండించిన పంట నుంచే విత్తన సేకరణ జరిపారని, అందువల్లనే 10-15 శాతం మేర కేళీలు వున్నాయని చెబుతున్నారు. పాయకరావుపేట వ్యవసాయ డివిజన్ పరిధిలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 5,191 క్వింటాళ్ల వరి విత్తనాలను రైతులకు అందజేశారు. వీటిలో 80 శాతం వరకు ఆర్‌జేఎల్-2537 రకం విత్తనాలేనని అధికారులు చెబుతున్నారు. మొత్తం 14,814 హెక్టారుల్లో వరిసాగు చేపట్టగా, దాదాపు పది వేల హెక్టారుల్లో కేళీల మొక్కలు వున్నట్టు రైతులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి, నకిలీ విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలపైన, వీటిని తమకు అందజేసిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల రైతులు కోరుతున్నారు.

రెచ్చిపోతున్న ఇసుకాసురులు

ఇసుక లారీలను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదం

- వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించడానికి ససేమిరా..
- పోలీసులకు ఫిర్యాదు చేసిన రెవెన్యూ సిబ్బంది
- ఈలోగా సగం లారీలను తరలించేసిన అక్రమార్కులు
- నాలుగు లారీలను సీజ్‌చేసిన పోలీసులు



రెవెన్యూ సిబ్బందితో లారీ సిబ్బంది వాగ్వాదం

అచ్యుతాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

అచ్యుతాపురంలో ఇసుక దళారులు ఒక బలమైన ముఠాగా తయారయ్యారు. ప్రభుత్వ అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా, విక్రయాలపై ప్రశ్నించిన ప్రభుత్వ ఉద్యోగులతో వాగ్వాదానికి దిగుతున్నారు. అధికారులు జరిమానాలు విధిస్తున్నప్పటికీ ఇసుక అక్రమ వ్యాపారాన్ని మాత్రం ఆపడంలేదు. స్థానికంగా ఇసుక కొరత వుండడంతో భవన నిర్మాణదారులు గత్యంతరంలేక దళారులు చెప్పిన ధరకు ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తున్నది. ఇసుక అమ్మకాల ద్వారా ఇబ్బడిముబ్బడిగా ఆదాయం వస్తుండడంతో జరిమానాలు చెల్లించడానికి వెనుకాడడంలేదు.

అచ్యుతాపురంలోని ఇసుక దళారులు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా భామినికి సమీపంలో ఒడిశా రాష్ట్ర పరిధిలో వంశధార నది నుంచి భారీ వాహనాలతో ఇసుకను రప్పిస్తున్నారు. ఒక్కో లారీలో 40 టన్నుల మేర ఇసుక వుంటుంది. రోజూ మాదిరిగానే మంగళవారం రాత్రి ఎనిమిది ఇసుక వాహనాలు వెదురువాడ కాటా వద్దకు వచ్చాయి. సమాచారం అందుకున్న ఆర్‌ఐ సోమేశ్‌కుమార్, వీఆర్వో శశి, వీఆర్‌ఏ రాము.. ఇసుక వాహనాలను తనిఖీ చేయడానికి కాటా వద్దకు వెళ్లారు. డ్రైవర్ల వద్ద వున్న ట్రిప్ షీట్లు పరిశీలించగా.. ఒడిశాలోని జయపురం సర్కిల్ పరిధి నుంచి అనకాపల్లి జిల్లా ఎలమంచిలికి ఇసుక రవాణా చేయడానికి పర్మిట్ ఉంది. ఇసుక లారీలను తహసీల్దార్ కార్యాలయానికి తరలించాలని రెవెన్యూ సిబ్బంది చెప్పగా, లారీల సిబ్బంది వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో రెవెన్యూ సిబ్బంది పోలీసులను ఆశ్రయించారు. ఈ సమయంలో నాలుగు ఇసుక లారీలను అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. పోలీసులు వెళ్లి నాలుగు ఇసుక లారీలను స్వాధీనం చేసుకున్నారు.

డిమాండ్‌నుబట్టి రేటు

రూపాయి పెట్టుబడి లేకుండా, చేతికి మట్టి అంటుకోకుండా ఇసుక దళారులకు పుష్కలంగా ఆదాయం వస్తున్నది. అచ్యుతాపురం ప్రాంతంలో భవన నిర్మాణాలకు సరిపడ ఇసుక అందుబాటులో లేకపోవడం వీరికి బాగా కలిసొచ్చింది. లారీల యజమానులతో టన్ను రూ.1,000కి ఒప్పందం చేసుకుని ఇసుకను ఇక్కడకు రప్పిస్తున్నారు. అప్పటికే ఇసుక అవసరమైన వారి నుంచి అడ్వాన్సుగా డబ్బులు తీసుకుని, ఇసుక లారీలు వచ్చిన వెంటనే ఆయా వ్యక్తులకు పంపుతున్నారు. డిమాండ్‌నుబట్టి టన్ను రూ.1,200 నుంచి రూ.1,600 వరకు విక్రయిస్తున్నట్టు సమాచారం. రోజూ సుమారు పది లారీల ఇసుక వస్తున్నట్టు తెలిసింది. ఒక్కో లారీలో 40 టన్నుల ఇసుక తెస్తున్నారు. అంటే రోజుకు 400 టన్నుల వరకు ఇసుక అమ్మకాలు సాగుతున్నాయి. టన్నుకు కనీసం రూ.200 చొప్పున ... మిగతా 8వ పేజీలో

మాటతప్పిన అభిజిత్ యాజమాన్యం

తెరుచుకోని ఫెర్రో అల్లాయిస్ కర్మాగారం

- ఉదయం నుంచి సాయంత్రం వరకు గేటు వద్ద నిరీక్షించిన కార్మికులు
- ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ డిమాండ్



అభిజిత్ కర్మాగారం గేటు వద్ద కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటీశ్వరరావు

అచ్యుతాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

అభిజిత్ ఫెర్రో అల్లాయిస్ యాజమాన్యం మరోసారి మాట తప్పింది. కర్మాగారాన్ని బుధవారం నుంచి తెరుస్తామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో మంగళవారం జరిగిన సమావేశంలో వెల్లడించిన యాజమాన్య ప్రతినిధులు, బుధవారం గేట్లు తెరవలేదు. విధుల్లో చేరడానికి కర్మాగారం వద్దకు చేరుకున్న కార్మికులు తీవ్ర నిరాశ చెందారు. అభిజిత్ ఫెర్రో అల్లాయిస్ యాజమాన్యం గత నెల 14వ తేదీ నుంచి లేఆఫ్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో వందలాది మంది కార్మికులు ఆందోళనకు దిగారు. అప్పటి నుంచి కర్మాగారం వద్ద, ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసన తెలియజేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మంగళవారం ఇక్కడ జనసేన పార్టీ కార్యాలయంలో కర్మాగారం యాజమాన్య ప్రతినిధులు, లేబర్ కాంట్రాక్టర్లతో చర్చలు జరిపారు. బుధవారం నుంచి కర్మాగారం తెరుస్తారని, కార్మికులు విధులకు హాజరు కావచ్చని ఎమ్మెల్యేతోపాటు యాజమాన్యం ప్రతినిధులు ప్రకటించారు. దీంతో కార్మికులు సంతోషించారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ... మిగతా 8వ పేజీలో

అన్నదాతలకు అండగా..

రైతులకు రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందిస్తున్న ప్రభుత్వం

- 1-5 ఎకరాల రైతులకు డ్రిప్ పరికరాలపై 90 శాతం సబ్సిడీ
- 5 నుంచి 12.5 ఎకరాల మధ్య ఉంటే 50 శాతం రాయితీ
- తుంపర సేద్యం పరికరాలకు 55 నుంచి 45 శాతం వరకు సబ్సిడీ
- రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు
- పరికరాల కంపెనీలను రైతులే ఎంపిక చేసుకోవచ్చు

అనకాపల్లి/ సబ్బవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేయడానికి బిందు, తుంపర సేద్యం విధానాలు దోహదపడతాయి. వీటి వినియోగం వల్ల బహుళ ప్రయోజనాలు వున్నాయి. నీరు ఆదా అవుతుంది. ఎరువులు నేరుగా మొక్కలకు అందడం వల్ల వృథాను అరికట్టవచ్చు. కలుపు బెడద తగ్గుతుంది. ఇన్ని ప్రయోజనాలు వుండడంతో రైతులను ప్రోత్సహించడానికి బిందు, తుంపర సేద్యం పరికరాలపై రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో రాయితీ ఇస్తున్నది.

వాస్తవంగా 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం ఉద్యాన రైతులకు రాయితీపై పెద్దఎత్తున బిందు, తుంపర్ల సేద్య పరికరాలు అందించింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాన్ని మూలకు చేర్చింది. రైతులకు యూనిట్లు మంజూరు చేసినప్పటికీ రాయితీ సొమ్మును విడుదల చేయలేదు. కూటమి ప్రభుత్వం రాకతో బిందు, తుంపర సేద్యం మళ్లీ జీవం పోసుకోనుంది. ఈమేరకు జిల్లా అధికారులు ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. బిందు, తుంపర సేద్యం పరికరాలు అవసరమైన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి, తగిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు జిల్లా అధికారి జీవీ లక్ష్మి సూచించారు. బిందు, తుంపర సేద్యం పరికరాలకు ప్రభుత్వం ఇచ్చే రాయితీ ఎంత? రైతులు భరించాల్సిన సొమ్ము ఎంత? ఏ రైతులు ఈ పథకానికి అర్హులు? దరఖాస్తు ఎలా చేసుకోవాలి.. తదితర విషయాల గురించి ఆమె వెల్లడించిన వివరాలు..



తుంపర సేద్యం పరికరాలతో అపరాల పంట సాగు

బిందు, తుంపర సేద్యం పరికరాలను రాయితీపై పొందేందుకు రైతులు తమకు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి, అక్కడ సిబ్బంది సహకారంతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందుకోసం రైతులు తమ వెంట ఆధార్ కార్డు, భూమి పట్టాదారు పాస్‌పుస్తకం/1బీ కాపీ, బ్యాంకు పాస్‌పుస్తకం, మొబైల్ ఫోన్‌ను వెంట తీసుకెళ్లాలి. కనీసం ఒక ఎకరా భూమి వుండి, పొలంలో మోటారుతో కూడిన బోరు/ బావి, సమీపంలో పంట కాలువ.. ఏదో ఒకటి వున్న వారు మాత్రమే అర్హులు. అన్ని వర్గాల రైతులకు ఒకే విధమైన రాయితీ వర్తిస్తుంది.



బిందు పరికరాలతో పంటను సాగు చేస్తున్న దృశ్యం

బిందు సేద్యం రాయితీ వివరాలు..

బిందు (డ్రిప్) సేద్యం పరికరాలకు ప్రభుత్వం 90 శాతం నుంచి 50 శాతం వరకు రాయితీ ఇస్తున్నది. ఒకటి నుంచి ఐదు ఎకరాల లోపు అయితే 90 శాతం రాయితీపై పరికరాలను ప్రభుత్వం అందజేస్తుంది. యూనిట్ విలువలో రైతులు పది శాతం సొమ్ము చెల్లిస్తే సరిపోతుంది. ఐదు ఎకరాల నుంచి 12.5 ఎకరాల వరకు 50 శాతం రాయితీ వర్తిస్తుంది. మిగిలిన సగం సొమ్మును రైతులు భరించాల్సి వుంటుంది.

తుంపర సేద్యం రాయితీ వివరాలు..

తుంపర (స్ప్రింక్లర్) సేద్యం పరికరాలకు ప్రభుత్వం 55 నుంచి 45 శాతం వరకు రాయితీ ఇస్తున్నది. ఒకటి నుంచి ఐదు ఎకరాల లోపు పొలం వున్న రైతులకు 55 శాతం, ఐదు ఎకరాలకు పైబడి భూములు వున్న రైతులకు 45 శాతం రాయితీ వర్తిస్తుంది. రాయితీ పోను మిగిలిన సొమ్మును రైతులు ముందుగా చెల్లించాల్సి వుంటుంది. రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు పొందేందుకు దరఖాస్తు చేయడానికి 2025 మార్చి చివరి వరకు గడువు వుంది. రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి జిల్లాకు కేటాయించిన సంస్థలు/కంపెనీల్లో తమకు నచ్చిన సంస్థ/ కంపెనీని ఎంపికచేసుకోవచ్చు. అనకాపల్లి జిల్లాకు ఫినోలెక్స్, సిగ్నెట్, కొఠారి, నెటాఫిమ్, జైన్, డ్రిప్ ఇండియా, సుధాకర్ ... మిగతా 8వ పేజీలో



డ్రిప్ ఇరిగేషన్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ జిల్లా అధికారి జీవీ లక్ష్మి

రెడ్డి మాస్టారుకి కన్నీటి వీడ్కోలు

అధికార లాంఛనాలతో పెదగోగాడలో అంత్యక్రియలు

- తరలివచ్చిన టీడీపీ నేతలు
- నిరాడంబర నేతకు ఘన నివాళులు



రెడ్డి సత్యనారాయణ భౌతికకాయం వద్ద గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

చోడవరం/ చీడికాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

దివంగత మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ భౌతికకాయానికి బుధవారం ఉదయం ఆయన స్వగ్రామం చీడికాడ మండలం పెదగోగాడలో అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారం జరిపారు. అంతకు ముందు సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అనకాపల్లి డీఎస్పీ మల్లంపాటి శ్రావణి, నర్సీపట్నం ఆర్‌డీవో వి.వి.రమణల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పెదగోగాడ చేరుకుని రెడ్డి సత్యనారాయణ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, తదితరులు ... మిగతా 8వ పేజీలో



రెడ్డి సత్యనారాయణ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు. చిత్రంలో ఎమ్మెల్యే బండారు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, పీవీజీ కుమార్..

యాజమాన్య పద్ధతులతో వరిలో అధిక దిగుబడి



రైతులకు సూచనలిస్తున్న ఏవో మోహన్‌రావు

ఎలమంచిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వరి పంటలో అధిక దిగుబడులు పొందవచ్చునని వ్యవసాయాధికారి పి.మోహన్‌రావు అన్నారు. మునిసిపాలిటీ పరిధి రామారాయుడుపాలెం వార్డులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వరి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ ఏడాది పంటల్లో ఎలుకల బెడద అధికంగా ఉందన్నారు. రైతులు పొలం గట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుని గడ్డి లేకుండా చేసుకోవాలన్నారు. అదే విధంగా గట్లు మీద కన్నాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. పొటాష్ ఎరువు ఎలమంచిలి, పులపర్తి రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. రానున్న రబీ సీజన్ దృష్ట్యా మినుములు, పెసలు విత్తనాలు ఎలమంచిలిలో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు గొర్లె బాబూరావు, ఎస్.అప్పారావు, గొర్లె మురళీ, వ్యవసాయ సహాయకులు అరుణ, దండి నూకునాయుడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి'



గోవిందపాలెంలో కొబ్బరి తోటను పరిశీలిస్తున్న ఏవో

రాంబిల్లి : వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు సాగు చేపడితే లాభదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత, ఉద్యాన శాఖాధికారిణి ప్రియ అన్నారు. గోవిందపాలెం, లాలంకోడూరు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. కొబ్బరి జీడి, తోటల్లోని యాజమాన్య పద్ధతులు, కిసాన్ క్రెడిట్ కార్డుల అవశ్యకత తదితరాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మేరీరత్నం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు హెరిటేజ్ డెయిరీ బాసట



పాడి రైతుకు బీమా చెక్కు అందిస్తున్న మేనేజర్ శేషు

రాంబిల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా హెరిటేజ్ డెయిరీ పనిచేస్తుందని సంస్థ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. మండలంలోని కృష్ణంపాలెం పంచాయతీ నారప్పపాలెంలో ఇటీవల పాడిరైతు లాలం రమేష్‌కు చెందిన ఆవు మృతిచెందడంతో సదరు రైతుకు డెయిరీ మంజూరు చేసిన బీమా చెక్కును బుధవారం అందజేసి మాట్లాడారు. హెరిటేజ్ డెయిరీకి పాలు పోసే రైతులకు డెయిరీ అన్నింటా బాసటగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు ఎల్.నాయుడు, రైతులు పాల్గొన్నారు.

తుప్పల మయం.. మలుపులతో భయం

▸▸ కొండకర్ల జంక్షన్ నుంచి ఎంజేపురం వరకు రహదారి దారుణం ▸▸ రాకపోకలకు పదిహేను గ్రామాల ప్రజలు ఇబ్బందులు ▸▸ పట్టించుకోని అధికారులు



ఎర్రవరం వద్ద ముందు భారీ వాహనం వెళుతుండడంతో వాహనదారుల ఇబ్బందులు



రోడ్డుకు ఇరువైపులా తుప్పలతో నిండి ఉన్న దృశ్యం

అచ్యుతాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం-అనకాపల్లి ప్రధాన రహదారిలో గల కొండకర్ల జంక్షన్ (సాధుపాకలు) నుంచి ఎంజేపురం వరకు రహదారి దారుణంగా ఉంది. అసలే ఇరుకు.. ఆపై మలుపుల కారణంగా ఇటుగా ప్రయాణాలు అంటేనే హడలిపోతున్నారు. కొండకర్ల జంక్షన్ నుంచి ఎర్రవరం, ఉప్పవరం, మల్లవరం, నరేంద్రపురం, ఎంజేపురం, గణపర్తి, చూచుకొండ, పల్లపు సోమవరం మీదుగా నర్సింగబిల్లి వద్ద గల హైవేకు ఈ రోడ్డు కలుస్తుంది. అంతేకాక ఎంజేపురం మీదుగా రాంబిల్లి మండలంలోని రామగిరి, చెర్లోపాలెం, మూలజంప మీదుగా కొత్తూరు వంతెన వరకు ఈ రోడ్డు ఉంది. కొండకర్ల జంక్షన్ నుంచి సుమారు పదిహేను గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాల తప్పుకోవడం ఈ రోడ్డులో కష్టం. దీనికితోడు ఈ రోడ్డుకు ఇరువైపులా భారీగా తుప్పలు పెరిగిపోయాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మలుపులు ఎక్కువగా ఉన్నందున ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయినప్పటికీ కనీసం హెచ్చరిక బోర్డులు సైతం పెట్టేవారు కరువయ్యారు. ప్రమాదకరమైన మలుపుల వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేద్దామన్న ఆలోచనను అధికారులు చేయకపోవడం గమనార్హం. రాత్రిపూట పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ గ్రామాలకు అనకాపల్లికి చెందిన ఒకే బస్సు తిరుగుతుంది. దీంతో అంతా ఆటోలతో పాటు ద్విచక్ర వాహనాలపై ఆధారపడాల్సిందే. రాత్రిపూట ఈ రోడ్డులో ఒంటరిగా ప్రయాణించాలంటనే భయాందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తుప్పల తొలగింపుతో పాటు ప్రమాదకరమైన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. .



సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న తెలుగుయువత నాయకుడుఅజయ్

'టీడీపీ సభ్యత్వ నమోదు విజయవంతం కావాలి'

రాంబిల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదు విజయవంతానికి అంతా కృషి చేయాల్సిందిగా ఆ పార్టీ మండల తెలుగు యువత అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్ పిలుపునిచ్చారు. మండలంలోని జడ్.చింతువా పంచాయతీ లోవపాలెంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో లక్ష్యానికి మించి సభ్యత్వం నమోదు కావాలన్నారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి లక్ష్యసాధనకు అనుగుణంగా అంతా పనిచేయాలన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడం వలన ప్రమాదవ శావత్తు మరణిస్తే రూ.ఐదు లక్షలు వరకు కుటుంబానికి బీమా వస్తుందన్నారు. సభ్యత్వం తీసుకున్న నాయకులు, కార్యకర్తలకు పార్టీ అన్నివిధాలా అండగా నిలుస్తుందని వివరించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు సూచన మేరకు పార్టీ పటిష్ఠతకు అంతా మరింత కష్టడి పనిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, యూనిట్ ఇన్‌చార్జి ఎరిపల్లి చిట్టిబాబు, పార్టీ గ్రామ అధ్యక్షుడు చెల్లూరి ఆనంద్, సీనియర్ నాయకులు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది నుంచి ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ

▸▸ బీఎల్‌వోలు శతశాతం విజయవంతం చేయాలి

▸▸ ఓటరు నమోదు అధికారిణి మనోరమా

ఎలమంచిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో చేపట్టే ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని బీఎల్‌వోలంతా శతశాతం విజయవంతం చేయాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారిణి (ఈఆర్‌వో) మనోరమా సూచించారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం తహసీల్దార్ వరహాలుతో కలిసి బీఎల్‌వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఎల్‌వోలంతా పారదర్శకంగా పనిచేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిబంధనలు పాటించాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, పోలింగ్ స్టేషన్ బదిలీ వంటివి జాగ్రత్తగా పరిశీలించి చేపట్టాల్సిందిగా సూచించారు. స్పెషల్ క్యాంపెయిన్ రోజుల్లో బీఎల్‌వోలంతా పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్లకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బీఎల్‌వోలతో సమావేశం నిర్వహిస్తున్న ఓటరు నమోదు అధికారిణి మనోరమా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



కుమార్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న యువకులు

అచ్యుతాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం- పూడిమడక రోడ్డులో అమూల్ డెయిరీ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. దీనికి సంబంధించి ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కశింకోట మండలం పల్లపు సోమవరానికి చెందిన మందపల్లి గోపి మహేశ్(28), గుర్రం కుమార్(23) సెజ్‌లో గల ఎస్సెన్షియా కర్మాగారంలో పనిచేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం వీరిద్దరూ బైక్‌పై అచ్యుతాపురం వైపు వస్తున్నారు. సరిగ్గా అమూల్ డెయిరీ వద్దకు వచ్చే సరికి అదే సమయంతో అవతల పక్క రోడ్డు నుంచి ఓ ట్యాంకర్ వస్తోంది. దీనిని గమనించని బైక్‌పై వస్తున్న వీరు బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, వీరిలో వెనుక కూర్చున్న కుమార్ పరిస్థితి విషమంగా ఉంది. వీరిలో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటరావు తెలిపారు.

సీతారాముల ఆలయానికి

మకరతోరణం బహూకరణ



విగ్రహాల వద్ద అలంకరించిన మకరతోరణం

రాంబిల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మూలజంపలో కొలువుదీరిన సీతారాముల ఆలయానికి ఆ గ్రామ ప్రజల ఆర్థిక సహకారంతో తయారు చేయించిన మకరతోరణాన్ని ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతి రోజూ మకరతోణాన్ని స్వామివార్లకు అలంకరించి పూజలు నిర్వహించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అందుకూరి ప్రసాద్, సర్పంచ్ వేగి అచ్చియ్యనాయుడు, మాజీ సర్పంచ్ వేగి రాము, ఉత్సవ కమిటీ సభ్యులు పండూరి నాగేష్, కోయిలాడ అప్పారావు, వేగి గోవింద తదితరులు పాల్గొన్నారు.

364 మంది బాలికలకు వ్యాక్సిన్



బాలికలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

నక్కపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేంపాడు జడ్పీ హైస్కూల్‌లో బుధవారం మానవసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ మూడో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 364 మంది విద్యార్థినులకు ఈ వ్యాక్సిన్ ద్వారా రక్షణ కల్పించామని హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి పూర్వపు డైరెక్టర్ డాక్టర్ రఘునాథ్, డాక్టర్ లీల చెప్పారు. బాలికలకు భవిష్యత్‌లో గర్భస్థ కేన్సర్, సర్వైకల్ కేన్సర్ రాకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ దోహదపడుతుందని చెప్పారు. అంతకు ముందు ఈ వ్యాక్సిన్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మూర్తిరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ కమిడి బాబబూరావు, ఉప సర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, పూర్వపు హెచ్‌ఎం కోడి శ్రీనివాసరావు, పీఈటీ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుతో ఉపాధి

▸▸ జనసేన పార్టీ నాయకులు



మద్దతు తెలుపుతున్న జనసేన నేతలు

నక్కపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని, దానివల్ల ఈ ప్రాంతానికి గుర్తింపు రావడమే కాకుండా నిరుద్యోగులకు, కర్షక, కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని జనసేన నాయకులు అభిప్రాయపడ్డారు. బుధవారం నక్కపల్లిలో పార్టీ నాయకులు కోసూరి నానిబాబు, పిక్కి కోదండ రామ్, బొడ్డా ప్రసాద్, సకురు భాస్కర్, కర్రి రవి, లోకేశ్ తదితరులు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తాము స్టీల్‌ప్లాంట్‌కు ఏర్పాటుకు పూర్తి మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. నియోజకవర్గంలోని విద్యావంతులు, యువతీ, యువకులు, కార్మికులకు స్టీల్‌ప్లాంట్ నిర్మాణ ప్రక్రియ నుంచి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని వారు కోరారు.

పవన్ వ్యాఖ్యలను వక్రీకరించడం తగదు

రాష్ట్ర పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ బోడపాటి శివదత్

నక్కపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హోం మంత్రి అనితను అగౌరవపర్చలేదని, పవన్ వ్యాఖ్యలను మంద కృష్ణమాదిగ వక్రీకరించడం తగదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ బోడపాటి శివదత్ పేర్కొన్నారు. బుధవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ క్రిమినల్స్‌కు కులమతాలు, రాజకీయ అండదండలు ఉండకూడదని, కఠినంగా శిక్షించాలనే ఉద్దేశంతో పవన్ మాట్లాడారు తప్ప, హోం మంత్రి అనిత సంతృప్తికరంగా పనిచేయడం లేదని ఎక్కడా చెప్పలేదన్నారు. పోలీసు వ్యవస్థలో కొందరికి ఇంకా వైసీపీ ప్రభుత్వ వాసనలు పోలేదన్నారు. మరోసారి పవన్ జోలికి వస్తే సరైన సమాధానం చెబుతామన్నారు. ఆయన వెంట నాయకులు పి.గణేశ్, కె.అప్పలరాజు, యలమంచిలి చంద్రరావు, బంగారిరాజు ఉన్నారు.

రీ సర్వే సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

▸▸ తహసీల్దార్ సత్యనారాయణ

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే జరిగిన గ్రామాలలో సమస్యల పరిష్కారాలకే ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తున్నదని తహసీల్దార్ సత్యనారాయణ చెప్పారు. మండలంలోని అరట్లకోట గ్రామంలో బుధవారం నిర్వహించిన రీ సర్వే భూ సమస్యల పరిష్కార గ్రామ సభలో ఆయన మాట్లాడారు. భూముల రీ సర్వేలో భూ విస్తీర్ణంలోగానీ, ఫొటో మిస్ మ్యాచింగ్ వంటి సమస్యలుగాని ఉంటే రైతులు అర్జీలు అందించాలని సూచించారు. దరఖాస్తు అందిన 15 రోజుల్లో వాటిని పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామసభలో రైతుల నుంచి 44 అర్జీలను అధికారులు స్వీకరించారు. వీటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.అప్పలనర్స, బీజేపీ, టీడీపీ నాయకులు వేముల వెంకటేశ్వరరావు, కట్టా శ్రీను, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్ర ప్రసాద్, ఆర్ త్రినాథ్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.



అరట్లకోట సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

రీ సర్వే గ్రామసభల్లో 380 ఫిర్యాదులు

నక్కపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే గ్రామసభల్లో నక్కపల్లి మండలంలోని అనేక గ్రామాల నుంచి మొత్తం 380 ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ నరసింహమూర్తి చెప్పారు. బుధవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. అక్టోబరు 17 నుంచి నవంబరు 5వ తేదీ వరకూ నిర్వహించిన రీ సర్వే గ్రామ సభల్లో 342 ఫిర్యాదులు, ఇతర సమస్యలపై 48 వినతులు వచ్చాయని చెప్పారు. వీటిని సమగ్రంగా పరిశీలించి నెలాఖరు నాటికి పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు నాలుగు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం

ఎస్.రాయవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో రేవుపోలవరం ఫీడర్‌లో ఉన్న రేవుపోలవరం, కొత్తపోలవరం, చినఉప్పలం, బంగారమ్మపాలెం గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. నూతన లైన్ల ఏర్పాటు పనుల్లో భాగంగా ఐదు గంటల పాటు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఈఈ కోరారు.

డి.అగ్రహారం పాఠశాలకు ప్రహరీ నిర్మాణం

ఎస్. రాయవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులను బుధవారం ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం, మాజీ ఉప సర్పంచ్ సియ్యాదుల అచ్యుత్ ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.23 లక్షలతో ప్రహరీ గోడను నిర్మిస్తున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు నాగేశ్వరరావు, రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా, పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కైలాసగిరి మెట్ల మార్గంలో తుప్పల తొలగింపు



కైలాసగిరి మెట్ల మార్గంలో తుప్పలు తొలగించిన దృశ్యం

ఎస్.రాయవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన రేవుపోలవరం సముద్రతీరం సమీపంలో ఉన్న కైలాసగిరి పైకి వెళ్లే మెట్ల మార్గంలో తుప్పలను బుధవారం తొలగించారు. తుప్పల కారణంగా సందర్శకులు ఇబ్బంది పడుతుండడాన్ని గమనించి టీడీపీ నాయకులు మైలపల్లి అప్పలరాజు, కొవిరి బంగారి యువకులతో కలిసి శ్రమదానంతో ఈ కార్యక్రమం చేపట్టారు. మెట్లు మార్గాన్ని మొత్త పరిశుభ్రం చేశారు. దీంతో పలువురు సందర్శకులు వారిని అభినందించారు.

శ్రీప్రకాష్‌లో ఉత్సాహంగా రిమ్‌జిమ్



నృత్యాలు, పాటలతో అలరిస్తున్న విద్యార్థినులు

పాయకరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థల విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న రిమ్‌జిమ్-2024 కార్యక్రమం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుగుతోంది. విద్యా సంస్థల ఆవరణలో రెండోరోజు బుధవారం సాహిత్యం, జానపద పాటలు, సంప్రదాయ నృత్యాలు, ఫ్యాన్సీ డ్రెస్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించగా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో శ్రీప్రకాష్ పాయకరావుపేట, తుని, అన్నవరం శాఖల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌కు రికార్డులు సిద్ధం చేయండి



ఉపాధి పనుల సోషల్ ఆడిట్ గురించి వివరిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పథకం పనుల సామాజిక తనిఖీలకు సంబంధించి వీఆర్‌పీలంతా రికార్డులు సిద్ధం చేయాలని ఎంపీడీవో డి.సీతారామరాజు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. సోషల్ ఆడిట్ నిర్వహణకు సంబంధించి ఎటువంటి రికార్డులు ఉండాలో వివరించారు. సీఆర్‌పీ నాగరాజు మాట్లాడుతూ ఉపాధి పనుల సోషల్ ఆడిట్ పారదర్శకంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీం.శ్రీను, హౌసింగ్ ఏఈ జగన్, ఏపీవో భాగ్యలత పాల్గొన్నారు.

నేడు ఆరు గంటలు పవర్ కట్

పాయకరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో వార్షిక నిర్వహణలో భాగంగా చెట్టు కొమ్మలు తొలగింపు తదితర పనుల నిర్వహణకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఆపరేషన్ డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పట్టణంలో 11 కేవీ చెక్కానగర్, 11 కేవీ మంగవరం ఫీడర్ల పరిధిలోని దొరకాలనీ, శ్రీప్రకాష్ విద్యా సంస్థల ఏరియా, మండలంలోని పీఎల్.పురం, సీతారాంపురం, నామవరం, పాయకరావుపేట, పీఎల్.పురం, సీతారాంపురం గ్రామాల్లో విద్యుత్ స్తంభాల వైర్లను ఆనుకుని ఉన్న చెట్టు కొమ్మలు తొలగింపు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన చెప్పారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

పాయకరావుపేట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సస్యరక్షణ చర్యలు చేపడితే వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఎ.ఆదినారాయణ తెలిపారు. మండలంలోని మాసాహెబ్‌పేట, పెంటకోట గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరి సాగులో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులను ఆయన వివరించారు. రబీలో జీడిమామిడి, వరి, అపరాలకు సంబంధించి బీమా గురించి రైతులకు తెలిపారు. జీడిమామిడికి ఎకరాకు రూ.1540, వరికి రూ.600, అపరాలకు రూ.300 చెల్లించాలని ఏవో సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది సతీష్, రైతులు పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

కోటవురట్ల, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యండపల్లి జంక్షన్ వద్ద గంజాయితో బుధవారం ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. అల్లూరిసీతారామరాజు జిల్లాలోని లోతుగెడ్డ వారపు సంతలో నాలుగు కిలోల గంజాయిని కొనుగోలు చేసి నర్సీపట్నం మీదుగా అడ్డరోడ్డు రవాణా చేస్తూ యండపల్లి వద్ద పట్టుబడ్డారు. జి.మాడుగుల మండల కేంద్రానికి చెందిన ముప్పల శ్రీనివాసరావు, హైదరాబాద్‌కు చెందిన సాయిప్రవీణ్, వరంగల్‌కు చెందిన నిఖిల్ లను అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

జల్లూరులో మహిళ అదృశ్యం

కోటవురట్ల, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లూరు గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు. బుధవారం 10 గంటల సమయంలో ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్టు ఆమె భర్త నాగరాజు ఫిర్యాదు చేశారన్నారు. కొత్త ఇంటి నిర్మాణం కారణంగా అప్పులు పెరగడంతో ఆమె మానసికంగా ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు.

అంటరానితనం లేని సమాజమే అందరి లక్ష్యం కావాలి

▸▸ ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సులో సీఐడీ అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్, డీఆర్వో దయానిధి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంటరానితనం లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐడీ అడిషనల్ ఎస్పీ డాక్టర్ జి. ప్రేమ్‌కాజల్ అన్నారు. విశాఖపట్నం రీజనల్ సీఐడీ కార్యాలయం ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్) చట్టంపై బుధవారం స్థానిక వివేకానంద చారిటబుల్ హాల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత ఆమెతో పాటు డీఆర్వో దయానిధి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం ప్రేమ్‌కాజల్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాలు, కేసుల నమోదు, విచారణ తదితరాలపై విద్యార్థులకు వివరించారు. అందరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. డీఆర్వో దయానిధి మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానమేనని పేర్కొన్నారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్ మాట్లాడుతూ భగవంతునికి లేని కులం మనం ఎందుకు పాటించాలని వివరించారు. జిల్లా అడిషినల్ ఎస్పీ ఎల్. మోహనరావు, సీఐడీ అధికారులు ఎం.నాగేంద్రభూపాల్, కుమారస్వామి, ఎం.శేషు, డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు, దళిత మహిళా శక్తి అధ్యక్షురాలు జి.మరియమ్మ, ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎం.గణేష్ తదితరులతో పాటు పలు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

‘క్రీడా రంగానికి ప్రోత్సాహకాలు అభినందనీయం’

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్రీడారంగానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించడం హర్షణీయమని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్వీ రమణ అన్నారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, క్రీడా మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, క్రీడా విభాగం ఎండీ గిరీషాలు ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా మూడు శాతానికి పెంచడం, పతకాలు సాధించిన క్రీడాకారులకు రెట్టింపు నజరానాలు ప్రకటించడం అభినందనీయమన్నారు. కడప, విజయవాడ, విజయనగరంలలో క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేస్తామనడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. మండల, నియోజకవర్గస్థాయి క్రీడా వికాస్ కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే, గ్రామాల్లో సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని కోరారు.

ఘనంగా కుసుమ హరనాథ ఆలయ వార్షికోత్సవం



కుసుమ హరనాథ బాబాను దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం కోటవీధిలో గల కుసుమ హరనాథబాబా ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పలువురు నాయకులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీరామదాసు వరహా సత్యనారాయణ, బొడ్డేడ సన్యాసినాయుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు

పరవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఎంతో ముఖ్యమని తెలియజేస్తూ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పరవాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సంతబయలు వద్ద స్వయం సహాయక సంఘాల సభ్యులంతా కలిసి మానవహారంగా ఏర్పడి రహదారి భద్రత ఆవశ్యకతను నినాదాల ద్వారా వివరించారు. రోడ్డుకు కుడి వైపు నడవాలని, రోడ్డు దాటేటప్పుడు రెండు వైపులా చూడాలని, పాదచారులు జీబ్రా క్రాసింగ్ ఉపయోగించుకోవాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ ఫోన్లు వినియోగించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు, ఫోర్ వీలర్‌లో వెళ్లేవారు సీటు బెల్టు ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి మురళీధరరావు, వెలుగు ఏపీఎం బి.రంగారావు, వెలుగు సీసీలు, వీఓఏలు, గ్రామసంఘ సభ్యులు పాల్గొన్నారు.

121 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లు

కొత్తూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం తగరంపూడిలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపుపై రూరల్ పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ సందర్భంగా 121 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఈ దాడి చేసినట్టు ఇన్‌చార్జి ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. బెల్టు షాపు నిర్వహిస్తున్న గల్లా వరహాలబాబును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

నాయుడుపాలెంలో సేంద్రియ ఎరువులు పంపిణీ



సేంద్రియ ఎరువులను పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

పరవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాంకీ ఫౌండేషన్ ప్రయోగాత్మకంగా చేపడుతున్న సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టులో భాగంగా రైతులకు సేంద్రియ ఎరువులను సమకూర్చింది. నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో 97 మంది రైతులకు వంద ఎకరాలకు సరిపడా సేంద్రియ ఎరువులను బుధవారం రాంకీ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, రీ సస్టైనబిలిటీ హెచ్‌ఆర్ మేనేజర్ బాలాజీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, మహిళా కో-ఆర్డినేటర్ రాజేశ్వరి, స్థానిక నాయకులు కూండ్రపు సీతారామయ్య, కూండ్రపు శ్రీరామ్మూర్తి, యమహా నాయుడు, రొంగలి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

దిగువ స్థాయి సిబ్బంది వస్తే సమస్యల పరిష్కారం ఎలా..?

▸▸ కశింకోట మండల సమావేశంలో అధికారుల తీరుపై ఎంపీపీ లక్ష్మి ఆగ్రహం ▸▸ గ్రామాలను సమష్టిగా అభివృద్ధి చేసుకుందామని పిలుపు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమష్టి కృషి ద్వారా పల్లెలను అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ కలగా లక్ష్మి పిలుపునిచ్చారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన కశింకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. మండల సమావేశానికి ప్రతిసారీ సంబంధిత శాఖల అధికారులు రాకుండా దిగువ స్థాయి సిబ్బంది వస్తే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలన్నింటినీ ప్రజలకు అందే విధంగా ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకొని ప్రజలకు సేవ చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు అందుబాటులో ఉండే విధంగా నిర్వహిస్తున్న గ్రామ సభలను, వ్యవసాయ అవగాహన సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు మాట్లాడుతూ తమ గ్రామ పరిధిలో వన్య ప్రాణుల వేట, కలప అక్రమ రవాణా జరుగుతుందని వాటిపై అటవీ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రోటోకాల్ పాటించి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యానవన శాఖాధికారిణి లావణ్య మాట్లాడుతూ జీడి, మామిడి తోటలకు ఇన్సూరెన్స్‌ను ఈనెల 15వ తేదీతేదీ లోగా చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో ఎ.రవికుమార్, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, సీడీపీవో ప్రభావతి, ఏవో స్వప్న, ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘స.హ.చట్టంపై అవగాహన అవసరం’

కశింకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఇక్కడి మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎ.రవికుమార్, తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాచార హక్కు అనగా అధికార యంత్రాంగం నియంత్రణ కింద ఉన్న ఏ సమాచారాన్నయినా ఈ చట్టం కింద పొందగలిగే హక్కు ఉంటుందన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా నకళ్లను సర్టిఫైడ్ కాపీలను తీసుకోవడం, సమాచార సంపత్తి, సర్టిఫైడ్ శాంపిల్ తీసుకోవడం వంటి చేయవచ్చునన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారి స్వప్న మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంలో ఉన్న 31సెక్షన్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్‌కు లిఖిత్‌రావు ఎంపిక



పరవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిది నుంచి నెల్లూరులో నిర్వహించనున్న అండర్-17 రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు కలపాక పంచాయతీ పరిధి మరిస వానిపాలేనికి చెందిన యర్రా లిఖిత్‌రావు ఎంపికయ్యాడు. ఇటీవల భీమిలిలో నిర్వహించిన జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో అద్భుత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. లిఖిత్‌రావు స్థానిక ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గ్రామం నుంచి రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు, తల్లిదండ్రులు శ్రీనివాసరావు,లావణ్య హర్షం వ్యక్తంచేశారు.

‘విద్యా, వసతి దీవెన’ బకాయిలపై రోడ్డెక్కిన విద్యార్థులు

▸▸ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన

▸▸ గత వైసీపీ ప్రభుత్వం చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన

▸▸ కూటమి సర్కారు వెంటనే స్పందించాలని డిమాండ్



నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడిన వివిధ కళాశాలల విద్యార్థులు



ఆర్డీవోకు వినతి అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తొలుత నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ విద్యార్థులకు గత ప్రభుత్వం చెల్లించాల్సిన విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ డబ్బులు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇచ్చేది లేదని తెగేసి చెపుతుండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకాన్ని కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తుండడం తగదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయడంతో పాటు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం ఆర్డీవో షేక్ ఆయాషాకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు ఎం.బాలాజీ, ఎస్.నాగరమణ, ఆనంద్, అర్జున్, నాయుడు, తరుణ్, లక్ష్మణ్‌లతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వం అజెండా

▸▸ గత వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారు ▸▸ అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే పంచకర్ల



సీసీ రోడ్డు పనులుకు శిలాఫలకానిన ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం, నవంబరు 6 : అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు పరిధి అజనగిరి, వెదుళ్లనరవ, కొత్తూరు, శెట్టివానిపాలెం తదితర గ్రామాల్లో బుధవారం పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని గాలికి వదిలేసిందని ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే పెందుర్తి నియోజకవర్గానికి రూ.25 కోట్లు నిధులు తెచ్చినట్టు వెల్లడించారు. వీటితో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. జనవరి నాటికి గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నట్టు చెప్పారు. రానున్న నాలుగున్నరేళ్లలో రాష్ట్రాని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలునాయుడు, వివిధ శాఖల అధికారులతో పాటు కూటమి నాయకులు ఇందలి వెంకటరమణ, ఎల్లపు శ్రీనివాసరావు, ఉరుకూటి శ్రీనివాసరావు, ఒమ్మి సత్యం, చల్లా శ్రీను, గవర సత్తిబాబు, ఎల్లపు శ్రీను, గంతకోరు శివ తదితరులు పాల్గొన్నారు.

గాలిభీమవరంలో ప్రభుత్వ భూమి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న భూమిలో తవ్విన ట్రెంచ్

సబ్బవరం, నవంబరు 6 : మండలంలోని గాలిభీమవరంలో విలువైన రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసు కున్నారు. ఇందుకు సంబంధించి తహసీల్దార్ చిన్నికృష్ణ తెలిపిన వివరాలివి. గాలిభీమవరం సర్వే నెంబరు 61లో కొండ పోరంబోకు రెండు ఎకరాలు ఉందన్నారు. సదరు భూమికి ఆనుకొని జిరాయితీ ఉండడంతో గతంలో కొండ పోరంబోకు రెండు ఎకరాలను అందులో కలిపేసుకొని లే-అవుట్ ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయమై గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేయడంతో సదరు కొండ పోరంబోకు భూమిని సర్వే చేసి, ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన కంచెను తొలగించామని చెప్పారు. అనంతరం ఆ రెండు ఎకరాల చుట్టూ ఎక్సకవేటర్ సహాయంతో ట్రెంచ్ (కాలువ) ఏర్పాటు చేశామన్నారు. సబ్బవరం సర్వే నెంబరు 63 గెడ్డవాగులో నిర్మాణం తొలగిం చామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బి.వీరయ్య, వీఆర్వో కె.వాత్సల్యరాయ్, సర్వేయర్ మాతా ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామ సభల్లో భూ సమస్యలకు పరిష్కారం

▸▸ పరవాడ, సబ్బవరం తహసీల్దార్లు అంబేడ్కర్, చిన్నికృష్ణ



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ అంబేడ్కర్



మొగలిపురంలో తహసీల్దార్ చిన్నికృష్ణకు అర్జీ సమర్పణ

పరవాడ/సబ్బవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సభల ద్వారా భూ సమస్యలకు చక్కని పరిష్కారం లభిస్తుందని పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, సబ్బవరం తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. బుధవారం పరవాడ మండలం పెదముషిడివాడ, సబ్బవరం మండలం మొగలిపురంలలో వేర్వేరుగా నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో మాట్లాడారు. రెవెన్యూ పరమైన సమస్యలపై అర్జీలు అందిస్తే పదిహేను రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా పెదముషిడివాడలో 235 మంది రైతులు అర్జీలను సమర్పించారు. పెదముషిడివా రెవెన్యూ పరిధిలోని గెడ్డవాగులు, ప్రభుత్వ భూములు, రోడ్లు, చెరువులు కాపాడాలని ఆర్‌టీఐ కార్యకర్త చిప్పాడ రామారావు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు, వీఆర్వో పృథ్వీరాజ్‌లతో పాటు రైతులు పాల్గొన్నారు. మొగలిపురంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గండి అరుణ్, ఎంపీటీసీ తమరాన సన్యాసమ్మ, పెద్దలు తమరాన బంగారు నాయుడు, అంగటి నానాజీ, రీ సర్వే డీటీ వై.గణేశ్, సర్వేయర్లు ఎల్.అప్పారావు, ఎస్.కృష్ణ, మౌనిష, ఎం.హరి, వీఆర్వో ఎస్.చెల్లుమాంబ, తమరాన సత్యనారాయణలతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీనారాయణనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో వైర్లపై వేలాడుతున్న చెట్టుకొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం ఏడు గం టల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్టేషన్‌రోడ్డు, తాకాశి వీధి, మళ్లవీధి, కోట్నివీధి, గాంధీబొమ్మ జంక్షన్, చిన్నవీధి, పెరుగు బజార్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

నేడు అనకాపల్లిలో తాగు నీటికి అంతరాయం

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధి తుమ్మపాల పంప్ హౌస్ నుంచి అనకాపల్లిలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే పైపులైన్ లీకైన కారణంగా గురువారం పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రజలకు తాగునీటికి అంతరాయం కలుగుతుందని నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణ తెలిపారు. ఇందుకు అంతా సహకరించాల్సిందిగా కోరారు. అయితే ప్రత్యామ్నాయంగా అవసరమయ్యే నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయనున్నట్టు చెప్పారు. ఆ మర్నాడు శుక్రవారం యథా విధా నీటి సరఫరా పునరుద్ధరణ జరుగుతుందని వివరించారు. ఈ విషయాన్ని అంతా గమనించాల్సిందిగా మురళీకృష్ణ కోరారు.

ల్యాండ్ పూలింగ్ రైతులకు నష్టపరిహానికి చర్యలు

▸▸ విశాఖ కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్

లంకెలపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ లేఅవుట్ ఏర్పాటుకు భూములిచ్చిన ల్యాండ్ పూలింగ్ రైతులకు నష్టపరిహారానికి చర్యలు తీసుకుంటానని విశాఖ కలెక్టర్ ఎంఎన్. హరేంధిర్ ప్రసాద్ హామీ ఇచ్చారు. పరవాడ మండలం పెదముషిడివాడలోని హౌసింగ్ లేఅవుట్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నష్టపరిహారం కోసం గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్న ల్యాండ్ పూలింగ్ రైతులతో మాట్లాడారు. నెల రోజుల్లోగా రైతులందరికీ నష్టపరిహారం కింద స్థలాలు కేటాయించి రిజిస్ట్రేషన్ చేసే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కాగా ఇదే విషయమై అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. స్థానికంగా గల రైతుల సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. విచారణ జరిపించి వీలైనంత తర్వగా ల్యాండ్ పూలింగ్ రైతుల జాబితాను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులకు ఆటంకం కలిగించవద్దని, అందరికీ న్యాయం చేస్తానన్నారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు, తహసీల్దార్ అంబేడ్కర్, స్థానిక నాయకులు కరణం నరసింగరావు, ఒమ్మి వెంకటరావు, బలిరెడ్డి అప్పారావు, బలిరెడ్డి సతీశ్, రావాడ నాయుడు, శివశంకర్, బొండా అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట స్టేషన్‌కు మాజీ ఎమ్మెల్యే గణేశ్



పోలీస్ స్టేషన్ వద్ద గణేశ్‌ను కలిసిన మాజీ మంత్రి బూడి

కశింకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలంటూ నర్సీపట్నం పోలీస్ స్టేషన్ ఎదుట మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ బుధవారం శాంతియుత ధర్నా చేపట్టారు. అయితే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే ఆలోచనతో పోలీసులు గణేశ్‌తో పాటు కౌన్సిలర్లు మాకిరెడ్డి బుల్లిదొర, శివప్రసాద్, వైసీపీ యువనేత చింతకాయల అరుణ్‌లను కశింకోట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, వైసీపీ నేతలు మలసాల కిశోర్, కలగ గున్నయ్యనాయుడు, జడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, కె.ఎం.నాయుడు తదితరులు మద్దతు తెలిపారు. వీరిని ఉదయం 11.30 గంటలకు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి సాయంత్రం 5.30 గంటలకు 41నోటీసు ఇచ్చి పోలీసులు విడిచిపెట్టారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నర్సీపట్నం పట్టణ సీఐ గోవిందరావు, రూరల్ సీఐ రేవతమ్మ, నక్కపల్లి సీఐ రామకృష్ణ, అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్, కశింకోట సీఐ స్వామినాయుడు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

104 సిబ్బంది ఆందోళనపై కార్యాచరణ సమర్పణ

తుమ్మపాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : 104 సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పద్నాలుగు రోజుల పాటు చేపట్టనున్న నిరసన కార్యక్రమాల కార్యాచరణకు సంబంధించిన నోటీసును బుధవారం తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.ఆర్.ఫణికుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో 104 సిబ్బందిని అరబిందో యాజమాన్యానికి అప్పగించారన్నారు. గడచిన నాలుగున్నర ఏళ్లలో డ్రైవర్ డీఈవోలుగా పని చేసిన అనేక సమస్యలను ఎదుర్కొన్నట్టు పేర్కొన్నారు. ఇతర ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ కంటే తక్కువ వేతనాలు తీసుకొంటూ చాలా అన్యాయానికి గురవుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యల పై గత ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకు వెళ్లినా ఫలితంకాలేదన్నారు. ప్రభుత్వం స్పందించాల్సిందిగా కోరారు.



కొయ్యూరులో నిర్వహించిన జల ఉత్సవ ర్యాలీ



డుంబ్రిగుడలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



చింతపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న వివిధ శాఖల అధికారులు

నీటి పొదుపుతోనే భవిష్యత్తు తరాలకు మనుగడ

» ఘనంగా జల ఉత్సవం ప్రారంభం

కొయ్యూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భగర్బ జలాల పరిరక్ష ణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాల్సిన అవశ్యకత ఉందని ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు పేర్కొన్నారు. జల ఉత్సవంలో భాగంగా నీటి వన రుల లభ్యత, జల వనరుల వినియోగంపై బుధవారం మండల పరి షత్ కార్యాలయ ఏవో బాల మురళీకృష్ణ ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎంఐ వెలుగు, సచివాలయ సిబ్బందితో పాటు ప్రజా ప్రతినిదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం నీటి వనరుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేలా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బావి తరాలకు సాగు, తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేలా భూగర్బ జలాలలను పరిరక్షించుకనేం దుకు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎంఐ జేఈ రామ కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సాయికృష్ణ, వెలుగు ఏపీఎం సాధన, సచివా లయ సిబ్బంది స్థానిక సర్పంచ్‌సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరుల సంరక్షణలో అందరి భాగస్వామ్యం

అనంతగిరి: నీటివనరులపై సంరక్షణపై ప్రతి ఒక్కరిని భాగ స్వామ్యం చేయాలని ఎంపీడీవో ఏవీవీ కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జల ఉత్సవ్, నీటివనరుల సంరక్షణ కార్యక్ర మంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ రూతు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమ్, ఏపీవో సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జల సంరక్షణతోనే భవిష్యత్తు

డుంబ్రిగుడ: నీటి పొదుపుతోనే భవిష్యత్తు తరాలకు మనుగడని ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీ టీసీ సభ్యురాలు జానకమ్మ అన్నారు. స్థానిక కేజీబీవీలో జలసంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలసి ప్రతిజ్ఞను చేపట్టారు.ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, సర్పంచి వెంకట రావు, ఎంఈవో సుందరరావు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెదబయలు: నీటి వనరుల సంరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య అన్నారు. జిల్లాలో ఈ నెల 6 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న జల ఉత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం అన్ని శాఖల అధికారులతో అవగాహన ర్యాలీ , మానవహారంగా చేపట్టారు. ఎంపీపీలు వరహాలమ్మ, రాజు, ఏపీవో పెదప్పలనాయుడు, ఏవో శ్రీనివాస్, ఏపీఎం మంగ పాల్గొన్నారు.

చింతపల్లి: జలాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నదని స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జీఆర్‌హెచ్ రాజు అన్నారు. బుధవారం స్థానిక ఈవోఆర్‌డీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధికారులు జల ఉత్సవం నిర్వహించారు. జెడ్పీటీసీ పోతురాజు బా లయ్య, ఏఈఈ బాలకిశోర్, ఏపీవో రాజు, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.



పెదబయలులో ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ



అనంతగిరిలో ర్యాలీ..



ముంచంగిపుట్టులో

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో బుధవారం జల్ ఉత్సవ్ కార్యక్రమంపై ఎంపడీవో ఎం.శ్రీసాయిహర్ష ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇంటి ఎదుట నిరాశ్రయులైన బాధిత కుటుంబాలు

కొయ్యూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాత బాలారం గ్రామంలో బుధవారం ఉదయం విద్యుత్ షార్టు సర్క్యూ ట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన నాగులాపల్లి అర్జున, కొండబాబులకు పూరిల్లు దగ్ధమైంది. దీంతో బాధిత కుటుం బాలకు సుమారు రూ. 5 లక్షలమేర ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా.

బాధితులకు సర్పంచి సాయం

బాధిత కుటుంబాలను గ్రామ సర్పంచ్ అప్పన అప్పలనర్స పరామర్శించి రూ. 10 వేలు అందించారు. అలాగే ప్రభుత్వపరంగా సాయం అందేలా చూడాలని ఎంపీడీవో, తహసీల్దారును ఫోన్‌లో కోరారు.

కాఫీ కార్మికుల పిల్లలకు ఉపకారవేతనాలు

చింతపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను అభ్యసిస్తున్న కాఫీ కార్మికుల పిల్లలకు ఉపకారవేతనాలు అందజేస్తున్నట్టు కేంద్ర కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ రమేశ్ తె లిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరు లతో మాట్లాడుతూ, ఏటా మాదిరిగా ఈసారీ ఉపకారవేతనాలు పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్టు చెప్పారు. ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.5వేలు, డిగ్రీ విద్యార్థులకు రూ.7,500, పీజీలకు రూ.15వేలు, వృత్తి విద్య కోర్సులవారికి రూ.20వేలు అందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50శాతం, ఇతర విద్యా ర్థులు 60శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. దరఖాస్తులను పాడేరు(మిను ములూరు), అరకులోయ, చింతపల్లి కేంద్ర కాఫీ బోర్డు కార్యాలయాల్లో ఈనెల 30 తేదీలోగా సమర్పించాలన్నారు.

'గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం'



టీడీపీ ఇన్‌చార్జి దొన్నుదొరకు వినతి పత్రమిస్తున్న సీహెచ్‌ఓలు

పాడేరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గిరి జన రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సబల్ ప్రాజెక్టునుఅమలు చేస్తున్నట్టు ప్రాజెక్టు కంట్రీ హెడ్ అనిరుధ్ అన్నారు. మండలంలో డి.గొం దూరులో వాసన్, రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ సం స్థల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సూక్ష్మ పారిశ్రామిక అవగాహనపై నిర్వహిం చిన కార్యమంలో ఆయన మాట్లాడారు. డి.గొం దూరులో చెరువుపై నిర్మించిన కోళ్ల పెంపకం షెడ్‌ను అనిరుధ్ లాంచనంగా ప్రారంభిం చారు. వాసన్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ సన్నీ, జిల్లా ప్రోగ్రామ్ అధికారి నాయుడు, రెయిన్ ఫారెస్ట్ అలయెన్స్ సంస్థ ప్రతినిధి వినూత్న, ఏపీ రైతు సాధికారత సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎల్.భాస్కరరావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం

ముంచంగిపుట్టు: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా జరిగింది. ఆ సంఘం అల్లూరి జిల్లా జనరల్ సెక్రటరీ వి.మ హేశ్వరరావు పరిశీలకులుగా, జిల్లా కార్యదులు ధర్మారావు, రఘునాథ్‌లు పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరగింది. యూటీఎఫ్ నూతన మండల అధ్యక్షుడుగా సమరెడ్డి రాజు, ప్రధాన కార్యదర్శిగా సీసా గోపి, గౌరవ అధ్యక్షులుగా ఎం.అప్పలనాయుడు, ఉపాధ్యక్షులుగా సిహె చ్.త్రినాద్, పి.ఈశ్వరమ్మ, కోశాధికారిగా శ్రీనివా సమూర్తి, కార్యదర్శులుగా క్రిష్ణ, దానయ్య, అవినాష్, సురేశ్‌కుమార్‌లతో పాటుపలువురు సభ్యులుగా నియమితులయ్యారు.

ప్రజా వేదిక వినతుల నిర్వహణపై అవగాహన అవసరం

» జేసీ ఎంజే అభిషేక్ గౌడ

పాడేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతుల నిర్వహణ ప్రక్రియపై అధికారులకు సంపూర్ణ అవగాహన అవసరమని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ సూచించారు. ఐటీడీఏ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణపై బుధ వారం నిర్వహించిన ఒక్కరోజు వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను వెబ్‌సైట్‌లో నమోదు చేసిన తర్వాత మూడు దశల్లో వాటిపై ఆడిట్ కొనసాగుతుందన్నారు.

నిర్దేశిత గడువులోగా వినతులను పరిష్కరించాలి: పీవో

ప్రజల నుంచి స్వీకరించిన వినతులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాల ని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ సూచించారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి నిరంతరంపర్యవేక్షిస్తున్నారన్నారు. అం దువల్ల జాప్యం లేకుండా వినతులను పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సబ్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, డీఆర్‌వో పద్మలత, ఎస్‌డీసీ భవానీ, ఐటీడీఏ ఏపీవో వీఎస్ ప్రభాకరరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ బాల సుందరబాబు, డీపీవో బి.లవరాజు, గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పీఎస్ కుమార్, సీపీవో ఆర్కే పట్నాయక్, గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఇన్‌చార్జి డీడీఎల్.రజని, డీఎంహెచ్‌వో జమాల్ బాషా, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వమిత్ర, సెరీకల్చర్ ఏడీ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌గౌడ, పక్కన ఐటీడీఏ పీవో అభిషేక్

ఆదివాసీల 48 గంటల ఆవేదన దీక్ష విరమణ



రెండో రోజు దీక్షలో పాల్గొన్న మహిళా ప్రతినిధులు

పాడేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ఉద్యోగా లను గిరిజన అభ్యర్థులతో మాత్రమే భర్తీ చేయాలనే డిమాండ్‌పై స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట గిరిజన నేతలు చేపట్టిన 48 గంటల ఆదివాసీల ఆవేదన దీక్ష బుధవారం సాయంత్రం విరమించారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని, షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ చట్టాన్ని రూపొందించి ఉద్యోగాలను ఎస్టీ అభ్యర్థులతో మాత్రమే భర్తీ చేయాలని ఈసందర్భంగా గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖిశేషాద్రి కోరారు. గిరిజన ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నేతలు, జేఏసీ ప్రతినిధులు పలాసి కృష్ణారావు, గంగన్నపడాల్, బి.సింహాచలం, ఎం.ఈశ్వరరావు, సుర్ల అప్పారావు, ఎస్.గంగరాజు, సోమెలి సింహాచలం, చిట్టపులి శ్రీనివాస్ ప డాల్, రామారావుదొర, మహిళా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: జీవో 3 చట్టబద్ధత కోసం ఆదివాసీలు పోరాటానికి సన్నద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్న య్య పడాల్ పిలుపునిచ్చారు.సిరిబాల పంచాయతీ మురగడాపల్లి గ్రామం లో పార్టీ ఏడో మండల మహా సభ జరిగింది. సీపీఎం నాయకులు చంటి బాబు, సత్యనారాయణ, బుజ్జిబాబు, బాలయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చింతపల్లి: ఉపాధ్యాయ నియామకాల్లో ఆదివాసీ యువతకు శతశా తం రిజర్వేషన్ కల్పించాలని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బా లయ్య అన్నారు. బుధవారం ఆదివాసీ నిరోద్యోగుల ఆవేదన దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. నాయకులు బొడు గంగరాజు, గెమ్మెలి మోహన్ రావు, యూవీ గిరి, కుడుమలు వెంకట రమణ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: జీవో 3 సాధించే వరకు పోరాడుతామని దండకా రణ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడా ఆనంద్ అన్నారు. బుధ వారం రెండో రోజు నిరుద్యోగులు రింతాడ గ్రామంలో ఆదివాసీ ఆవేదన దీక్ష చేపట్టారు. మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల దీక్షకు డీఎల్‌వో నాయకులు సంఘీభావం తెలిపారు.దేవరాపల్లి సర్పంచ్ సిరిబాల బుజ్జిబా బు, సోమేశ్ కుమార్, సీమన్, గాబ్రియేల్, పాల్గొన్నారు.

13 గంటల పాటు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

సీలేరు, నవంబరు 6 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరుతోపాటు మరో ఐదు గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు సుమారు 13 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సీలేరు చుట్టుపక్కల ఉన్న చింతపల్లిక్యాంప్, టీఆర్‌సీ, బూసుకొండ, చంద్రుపల్లి, లైకన్‌పూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే 33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతికలోపాలు తలెత్తి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జెన్‌కో ఏడీఈ కె శ్రీనివాసులు, ఏఈ జీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమస్య పరిష్కరించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

వైసీపీ నేతలకు గిరిజన సంక్షేమంపై మాట్లాడే హక్కు లేదు

టీడీపీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు కిడారి శ్రావణ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్

పాడేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ నాయకు లు గిరిజనులకు తీవ్ర అన్యాయం చేశారని, ఈ స్థితిలో సంక్షేమంపై మాట్లాడే హక్కు వారికి లేద ని తెలుగుదేశం పార్టీ అరకు లోయ పార్లమెంటరీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ విమర్శించారు. తన నివాసంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. వైసీపీ పాలనలో గిరిజనులకుతీవ్ర అన్యాయం చేశారని, గిరిజనులకు చెందిన అనేక పథకాలను రద్దు చేశారన్నారు. ఇప్పుడు గిరిజనుల కోసం వైసీపీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతుండడం విడ్డూరంగా ఉందన్నారు.

జీవో 3పై అధికారంలో ఉన్నప్పుడు స్పందించలేదేమీ?

జీవో 3 రద్దయిన తర్వాత వైసీపీ రెండేళ్ల పాలనలో ఉన్నప్పటికీ కనీసం దానిపై పట్టించుకోని వైసీపీ ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ప్రస్తుతం తమ ప్రభుత్వంపై మాట్లా డడం విడ్డూరంగా ఉందని శ్రావణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు బాకూరు వెంకటరమణరాజు, పాండురంగస్వామి,తామర్ల సత్యనారాయణ, శశి భూషణ్‌నాయుడు, ప్రసాద్, అచ్చిబాబు, త్రినాద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సీహెచ్‌ఓల వినతి



టీడీపీ ఇన్‌చార్జి దొన్నుదొరకు వినతి పత్రమిస్తున్న సీహెచ్‌ఓలు

అరకులోయ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య శాఖలో పనిచేస్తున్నకమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌ఓ)గా పని చేస్తున్న తమకు సుమారు 11 నెలల నుంచి ఇన్సెంటివ్ చెల్లించడం లేదని, జీతాల నుంచి ఈపీఎఫ్ చెల్లింపులూ నిలిపివేశారని, ప్రభుత్వప రంగా న్యాయం చేయాలని ఉద్యోగుల ప్రతినిధుల బృందం టీడీపీ అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి దొన్నుదొరను ఆయన నివాసంలో కలిసివినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓల ప్రతినిధులు ఉదయశ్రీ, లావణ్య, శాంతి సమస్యలు వివరించారు. మం త్రుల దృష్టికితీసుకువెళ్లిసమస్యలు పరిష్కరించేలాచూస్తాననిదొన్నుదొరహమీ ఇచ్చారు.

బదిలీ ఉద్యోగులకు ఘన సన్మానం

డుంబ్రిగుడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పోతంగి పంచాయతీలో బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సచివాలయ సిబ్బంది స్థానిక సర్పంచి వెంకటరావు అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ బది లీపై వీఆర్వో ఝాన్సీలక్ష్మి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శీనివాసరావు, ఎనర్జి అసిస్టెంట్ నిరంజన్ సైతం పంచాయతీ ప్రజలకు ఎంతో సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ లక్షణ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పొత్తిళ్లలోనే కొడిగడుతున్న పసిమొగ్గలు

» మన్యంలో మరణాల నిష్పత్తి 3.41 శాతం

» 7 నెలల్లో 49మంది చిన్నారులు మృతి

» 46 మందికి గుండె జబ్బులు

» బలహీనంగా 113 మంది జననం

» నేడు ప్రపంచ శిశు సంరక్షణ దినోత్సవం

చింతూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):ప్రభు త్వాలు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పుకుంటు న్నా మన్యంలో శిశు మరణాలను మాత్రం నిలువరిం చలేకపోతున్నారు. అవగాహన, సమన్వయం, పర్య వేక్షణ, ఆర్థికలేమితోపాటు వైద్య శాఖలో ఖాళీలను భర్తీ చేయకపోవడం గిరిపుత్రులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్‌లో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 1435 మంది తల్లులు బిడ్డలకు జన్మనిచ్చారు. వీరిలో 49 మంది చిన్నారులు మృత్యువాతపడ్డారు. అంటే 3.41 శాతం మరణాల రేటు న మోదైనట్లు అధి కారిక గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. నమోదు కా ని మరణాలు మరిన్ని ఉంటాయని అభిప్రాయాలూ లేకపోలేదు. ఒక్క చింతూరు ఏరియా ఆసుపత్రిలోనే జనవరి నుంచి అక్టోబరు వరకు 689 మంది ప్రస వాలు జరిగాయి. వీరిలో 46 మంది చిన్నారులకు గుండె జబ్బులున్నట్టు వైద్యులు గుర్తించారు. సాధా రణ బరువు రెండున్నర కిలోలు కాగా మరో 113 మంది చిన్నారులు అంతకంటే తక్కువ బరువుతో పుట్టారు. ఇందుకు ప్రధాన కారణం పౌష్టికాహార లోపమేనన్న అభిప్రాయాలున్నాయి. చింతూరు డివిజన్‌లో 10 పీహెచ్‌సీలు, ఒక ఏరియా ఆసుపత్రి, ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రత్యేక నవజాత శిశు చికిత్స కేంద్రంఉన్నాయి. 266 ప్రధాన అంగన్‌వా డీలు, 166 మినీ అంగన్వాడీ కేంద్రాలున్నాయి. చింతూరులోని ప్రత్యేక నవజాత శిశు వైద్య శిబిరం ద్వారా ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు 0 -30 రోజుల వయసున్న 334 మందికి చికిత్స అం దించాల్సి వచ్చింది. ఒక మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డకు మూడేళ్ల వయసు వచ్చేంత వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తు న్నారు. వీటిలో బాల సంజీవని కిట్, టేక్ హోం రేషన్ ఉన్నాయి. ఇక బిడ్డకు మూడేళ్లు దాటిన నుంచి అంగన్‌వాడీల్లోనే ప్రతిరోజూ గుడ్డు, పాలుతో పాటు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నారు. ఇన్ని కల్పిస్తున్నా, శిశు మరణాలు మాత్రం ఆగ డంలేదు. గుండె జబ్బులు, రక్త హీనత, శ్వాసకోస ఇబ్బందులు బిడ్డల్ని పట్టిపీడిస్తున్నాయి.



చింతూరు ఏరియా ఆసుపత్రిలో మంగళవారం మృతి చెందిన పసిబిడ్డ (ఫైల్)

సీలేరు నుంచి కాలినడకన తిరుమలకు...



సీలేరునుంచి తిరుమలకు కాలినడకన బయలు దేరిన గురుమూర్తి

సీలేరు, నవంబరు 6 , (ఆంధ్రజ్యోతి):జీకేవీధి మండలం సీలేరు గ్రామానికి చెందిన కొర్రా గురుమూర్తి అనే యువకుడు వెంకటేశ్వర మాలను ధరించి బుధవారం స్వామి వారి దర్శనం కోసం తిరుమలకు పయనమ య్యా డు. సీలేరుకు చెందిన ఏపీ జెన్‌కో రిటైర్డు ఉద్యోగి కొర్రా ధనుకుమారుడు గురుమూర్తి వెంక టేశ్వరస్వామి భక్తుడు. గత మూడే ళ్లుగా వెంకటేశ్వరస్వామి వారి మాల ధరించి నియమనిష్ఠలతో దీక్షలను చేపడతాడు. ఈ క్రమంలో పది రోజుల కిందట దీక్ష ప్రారంభించారు. సీలేరు నుంచి భద్రాచలం, విజయవాడ మీదుగా తిరు మలకు కాలనడకన పయనమయ్యారు. సీలేరు నుంచి తిరుపతికి 750 కిలోమీటర్ల ఉండగా, రోజుకు 20 నుంచి 25 కిలోమీటర్ల మేర నడుస్తూ, 40 రోజుల దీక్షను పూర్తి చేసి స్వామి వారిని దర్శించుకుంటానని గురుమూర్తి తెలిపారు. స్వామి వారి దర్శనం అనంతరం తిరిగి బస్సుల్లో సీలేరు చేరుకుంటానని ఆయన తెలిపారు.

ఎఫ్‌పీవోల బలోపేతానికి ఆర్థిక సహకారం

» పది సంఘాలకు రూ.4కోట్ల ప్రోత్సాహం.. నాబార్డు డీడీఎం చక్రధర్



లంబసింగి ఎఫ్‌పీవోకి వచ్చిన అవార్డుచూపిస్తున్న నాబార్డు డీడీఎం చక్రధర్, శాస్త్రవేత్తలు

చింతపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవో) బలోపేతానికి నాబార్డు ఆర్థిక సహకారం అందిస్తున్నట్టు జిల్లా అభివృద్ధి మేనేజర్ (డీడీఎం) రావూరి చక్రధర్ తెలిపారు. బుధవారం లంబసింగి రైతు ఉత్పత్తి దారుల సంఘం వార్షిక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసం దర్భంగా మాట్లాడుతూ గిరిజన రైతుల ఆర్థిక ప్రగతి లక్ష్యంగా నాబార్డు ఎఫ్‌పీవోలకు ప్రోత్సాహాలను అందజేస్తోందన్నారు. జిల్లాలో పది ఎఫ్‌పీవోలకు రూ. 4 కోట్ల పోత్సా హక నిధులను అందజేశామన్నారు. స్పైస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బి. కల్యాణి, స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, శాస్త్రవేత్త శెట్టి బిందు, వ్యవసాయ పరిశోధ న స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్‌రెడ్డి రైతులకు మిరియాలు, కాఫీ, పసుపు, అల్లం పంటల్లో మెలకువలు, నూతన వంగడాలను వివరించారు. దక్షిణ భారత దేశంలో లంబసింగి ఎఫ్‌పీవో సేవలను గుర్తించి హైదరాబాద్ భారతీయ చిరు ధాన్యాలఅభివృద్ధి సంస్థ ఉత్తమ సేవా అవార్డును అందజేసినట్టు సీ ఈ వో రాజేశ్ తెలి పారు.ఎఫ్‌పీవో చైర్మన్ నూకరాజు, డైరెక్టర్లు ఇందిర, సరోజ, శోభారాణి, కన్నబాబు, ఐఐఎంఆర్ ప్రతినిధి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

జెడ్పీ సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

విశాఖపట్నం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకుపరిపాలనాఅధికారులుగా పదోన్నతులు కల్పించారు.వీరిలో ఎన్‌వీహెచ్‌ఆర్ స్వామిరావికమతం మండలం, వీఆర్ రాజేశ్వరి విశాఖ జిల్లా పరిషత్, వేణు గోపాల్‌ను డుంబ్రిగూడ మండల పరిపాలనాధికారులుగానియమించారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సీఈవో పి.నారాయణమూర్తి వీరికి పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు.

మత్స్యగుండం అభివృద్ధి చేయాలని వినతి



ఐటీడీఏ పీవోకు వినతిప త్రమిస్తున్న సర్పంచు

హుకుంపేట నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మఠం పంచాయతీలో ని గిరిజనులకు ఆరాధదైవమైన మత్స్య గుండం పుణ్యక్షేత్రం అభివృద్ధి చేయాలని కోరుతూ స్థానిక సర్పంచు శాంతి కుమారి ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్య మాన్ పటేల్‌కు బుధవారం వినతి పత్రం అందజే శారు. కార్తీక మాసం కావడంతో ఈ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు రాకపోక లకు ఇబ్బంది లేకుండా మఠం జంక్షన్ నుంచి మత్స్యగుండం వరకు రోడ్డు బాగు చేయాలని కోరారు. మహాశివరాత్రికి వచ్చే భక్తులకు స్నానాలకు నీటి వసతి, విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు. ఆలయ కమిటీసభ్యుడు మత్స కొండబాబుపాల్గొన్నారు.

మెరుగైన వైద్యమందించండి: డీఎంహెచ్‌వో

హుకుంపేట నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించాల ని డీఎంహెచ్‌వో జమాల బాషా అన్నారు. మండలంలోని ఉప్ప పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లలతో ఎన్‌సీడీసీ ప్రోగ్రాంపై సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తూ ప్రజ లకు వైద్య సేలందించాలన్నారు.గర్భిణులు, బాలింతలకు ఆశ వర్కర్లు సకాలంలో వైద్యమందించేలా చూడాలన్నారు. నాటు వైద్యులను ఆ శ్రయించకుండా చూడాలని కోరారు. శిశు మరణాలు లేకుండా వైద్యాధికారులు చూడాలన్నారు.

బాధితులకు సకాలంలో వైద్య సేవలందించాలి

ముంచంగిపుట్టు: రోగులకు సకాలంలో వైద్య సేవలు అందే విధంగా ఆశ కార్యక ర్తలు చూడాలని వైద్యాధికారి ప్రతాప్ అన్నారు. కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరి ధిలో గల తొమ్మిది సచివాలయాలకు చెందిన ఆశ కార్యకర్తలకు ఆయుష్మాన్ మిషన్‌లో వివిధ రకాల వ్యాధులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్ ఆశ కార్యకర్తలకు పలు సలహాలు సూచనలను అందించారు. ఈ కార్యక్రమం లో వైద్యులు రమేష్, త్యాగరాజు, ఆరోగ్య విస్తరణ అధికారి కె.సుబ్రహ్మణ్యం, హెల్త్ సూపర్ వైజర్లు కృష్ణవేణి, వేదావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సలకు 8 మంది ఎంపిక

పెదబయలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం పెదబయలు, గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చేపట్టిన ఉచిత నేత్ర వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఈ పీహెచ్‌సీల పరిధిలో కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న 88 మందికి విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు పరీక్షలు చేసినట్టు పెదబయలు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.నిఖిల్ తెలిపారు. గోమంగి పీహెచ్‌సీ వైద్యులు కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో అల్లూరి సీతా రామరాజు జిల్లా గంగవరం మండలం నెల్లిపూడికి చెందిన చాకలి చిట్టిబాబు (40) మృతి చెందారు. చిట్టిబాబు బైక్‌పై తన గ్రామం నుంచి కరీంనగర్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఏలూరు సమీపంలోని దుగ్గిరాల బ్రిడ్జి దాటిన తరువాత ముందు చక్రం టైరు పంచర్ అయి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఐరన్ గార్డులను ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని ఏలూరు 108లో ఏలూరు ప్రభుత్వాసు పత్రికి బుధ వారం సాయంత్రంతీసుకురాగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు.

సమస్యలపై వీవోఏల ఆందోళన

పాడేరురూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) వెలుగు వీవోఏల సమస్యలను పరిష్క రించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆర్ భాను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వెలుగు కార్యాలయం ఎదుట 6 నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని తదితర సమస్యలపై ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం నాయకులు ఎల్‌బీ పోతురాజు, సువర్ణ, తార, కొండ బాబు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: వీవోఏలకు మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరుతూ జాతీయ రహదారిలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనతరం వెలుగు ఏపీఎం శ్రీరాములుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నేత పోతురా జు, వీవోలు భాస్కర్, శానివాసులు, దేవి జమున తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. సూరిబాబు డిమాండ్ చేశారు. బుధవారం వీవోఏలు సీఐటీయూ, గిరిజన సంఘం నాయకులతో కలిసి పలు సమస్యలపై ఎంపీడీవో, తహసీల్దార్, ఎస్సైకి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు అప్పలనాయుడు, వీవోఏ నాయ కులు మల్లేశ్వరరావు, శాంతికుమారి, చంటి, శోభన్ బాబు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: వీవోఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రిలే నిరా హార దీక్ష చేపట్టారు. వేధింపులు, తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో సీఐటీయూ నేతలు శంకరరావు, భీమరాజు, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు త్రినాద్, వీవోఏలసంఘం నేతలు జ్యోతి, రాజారావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

అభివృద్ధిని చూసి ఓర్వలేకే దౌర్జన్యాలు

▸▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

రోలుగుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్‌రాజు చెప్పారు. ఎంకేపట్నం-కొరుప్రోలు రహదారి నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూరైన నేపథ్యంలో బుధవారం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం వైసీపీ నాయకుల కక్షపూరిత చర్యలకు నిదర్శనమన్నారు. వైసీపీ ప్రభుత్వం పడగొట్టే ప్రభుత్వం అని, కూటమి ప్రభుత్వం నిలబెట్టే ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎప్పటి నుంచో రహదారి లేక ఇబ్బందులు పడుతున్న కొరుప్రోలు గిరిజనులకు ఇక కష్టాలు తీరిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జి.చంద్రమౌళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, నాయకులు మడ్డు పైడితల్లి నాయుడు, రొంగలి గంగరాజు, పిట్ల బుల్లిబాబు, బి.నరేష్, సుర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేశ్ అరెస్టు... విడుదల

▸▸ పోలీస్ చట్టం 30 ప్రకటించిన డీఎస్పీ మోహన్



మాజీ ఎమ్మెల్యే గణేశ్‌జాజీ అరెస్టు చేస్తున్న పోలీసులు

నర్సీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ పోలీస్ స్టేషన్ వద్ద తలపెట్టిన ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. గబ్బాడ డిపోలో ఇసుక అక్రమ రవాణా జరిగిందని, వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టారని నిరసిస్తూ బుధవారం పోలీసు స్టేషన్ ఎదుట శాంతియుత ధర్నాకు పిలుపునిస్తూ బధవారం పెదబొడ్డేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి నర్సీపట్నం ర్యాలీగా బయలుదేరిన వైసీపీ నాయకులను రెసిడెన్సియన్ స్కూల్ ముందు పోలీసులు అడ్డుకున్నారు. నర్సీపట్నంలో పోలీసు చట్టం 30 అమలులో ఉందని ప్రకటించిన డీఎస్పీ మోహన్, అందుకనుగుణంగా బుధవారం పట్టణమంతా ప్రధాన కూడళ్లలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పెదబొడ్డేపల్లి రెసిడెన్సియ్ స్కూల్ వద్ద ప్రత్యేక బలగాలను మోహరించారు. మాజీ ఎమ్మెల్యే గణేశ్, మునిసిపల్ కౌన్సిలర్ బుల్లిదొర, పార్టీ అధ్యక్షుడు ఏకాశివ, చింతకాయల వరుణ్‌ను అరెస్టు చేసి కశింకోట తరలించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, మిగిలిన వైసీపీ శ్రేణులను అరెస్టు చేశారు. కాగా, పోలీసు విధులకు భంగం కలిగించినందుకు నర్సీపట్నం టౌన్‌లో 32 మంది నాయకులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశామని డీఎస్పీ మోహన్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు 41 నోటీసులు ఇచ్చి అందర్నీ విడిచిపెట్టామని ఆయన చెప్పారు.

ఇసుక దోచుకున్న గణేశ్‌ను అరెస్టు చేయాలి

జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీరసూర్యచంద్ర



విలేకరులతో మాట్లాడుతున్న జనసేన నేత సూర్యచంద్ర, పక్కన నాయకులు

నర్సీపట్నం అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గబ్బాడ ఇసుక యార్డులో 48 వేల టన్నుల ఇసుక దోచుకున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్‌ను అరెస్ట్ చేయాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీరసూర్యచంద్ర డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుకను అక్రమంగా దోచుకుని ప్రస్తుతం ఏమీ తెలియనట్టు వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఇసుక పాయింట్‌లో అవినీతి జరుగుతుందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు గతంలోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా చౌకబారు మాటలు మానుకుని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని హితవు పలికారు. ఆయన వెంట జనసేన నేతలు అద్దేపల్లి గణేశ్, మాకిరెడ్డి వెంకటరమణ ఉన్నారు.

పశుగణన కచ్చితంగా చేపట్టండి

▸▸ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు పుష్ప



ఇంటింట పశుగణన సర్వేను పర్యవేక్షిస్తున్న ఏడి పుష్ప

రావికమతం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత గడువులోగా కచ్చితమైన పశుగణనను చేపట్టాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు టి.పుష్ప సూచించారు. మండల కేంద్రంలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న పశుగణన సర్వేను బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 16 రకాల జాతులపై పశుగణన కోసం రావికమతం, రోలుగుంట మండలాల్లో 19 మంది ఎన్యుమరేటర్లను నియమించామని, వారంతా ఇంటింటికీ వెళ్లి నిర్దేశిత సమాచారం సేకరించాలని సూచించారు. కచ్చితమైన గణనను చేసిన అనంతరం ఆ ఇంటి గోడపై ఓ స్టిక్కర్ కూడా అంటించాలన్నారు. ఎన్యుమరేటర్లకు పశు పెంపకందారులు సహకరించాలని ఆమె కోరారు. ప్రభుత్వ గుర్తింపు కార్డు ఉన్న ఎన్యుమరేటర్లకే రైతులు వివరాలు తెలపాలన్నారు. అలాగే పశుగణన చేసే సిబ్బందికి ఎటువంటి రుసుం ఇవ్వాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ సర్వేను పశు వైద్యాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బుచ్చింపేట పశు వైద్యాధికారి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ రైతులకు రాయితీలు

▸▸ ఉద్యానవన శాఖాధికారి భానుపుష్పలీలావతి

రావికమతం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు అందిస్తున్నదని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి వి.భానుపుష్పలీలావతి సూచించారు. మేడివాడ పంచాయతీ శివారు అప్పలమ్మపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ మొదటి నాలుగేళ్ల ఏడాదికి హెక్టార్‌కు రూ.5,250 చొప్పున రాయితీ అందిస్తుందన్నారు. అలాగే అంతర పంటలైన అరటి, కూరగాయల సాగుకు కూడా అదే మొత్తంలో రాయితీ అందుతుందన్నారు. మండలంలో ఇప్పటికే 229 హెక్టార్లలో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని, ఈ ఏడాది మరో 40 హెక్టార్లలో సాగు లక్ష్యంగా చేసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో పతాంజలి, ఆస్ప్ ప్రతినిధులు టి.చంద్రశేఖర్, కె.రమేష్, డి.శ్రీరామ్ పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్‌కు రాచమార్గం

గాలి వీస్తే భయం.. తుఫాన్ వస్తే గందరగోళం.. ఎక్కడ చిన్న సమస్య వచ్చినా తీవ్ర అవాంతరం.. ఇదీ నర్సీపట్నంలో విద్యుత్ సరఫరా దుస్థితి! దీనికి కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కార మార్గం చూపుతుంది. నిరంతర విద్యుత్‌కు రాచమార్గం వేస్తుంది. రూ.67.35 కోట్లతో 220 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి సమాయత్తమైంది. ఇందుకు గురువారమే శ్రీకారం పడనుంది.

నర్సీపట్నానికి కొత్తగా 220 కేవీ సబ్ స్టేషన్

- ▸▸ రూ.67.35 కోట్లు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం
- ▸▸ బలిఘట్టం 132/11 కేవీ సబ్ స్టేషన్ ఆవరణలో నిర్మాణం
- ▸▸ నర్సీపట్నానికి ఎంతో ఉపయుక్తం.. చోడవరానికీ ప్రయోజనం
- ▸▸ అవాంతరం లేని సరఫరా సరఫరాకు మార్గం సుగమం
- ▸▸ లోవోల్టేజీ సమస్యకూ శాశ్వత పరిష్కారం
- ▸▸ నేడు సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన



కొత్తగా 222 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్న ప్రదేశం ఇదే..

నర్సీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమమైంది. లోటల్టేజీ, ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వంటి సమస్యలకు చెక్ పడనుంది. నిరంతర విద్యుత్ సరఫరా కోసం కూటమి ప్రభుత్వం బలిఘట్టంలోని 132/11 కేవీ సబ్ స్టేషన్ పక్కనే రూ.67.35 కోట్లతో 220 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయనుంది. ఇక్కడ 160 ఎంవీఏ(మెగా ఓల్ట్ యాంప్) సామర్థ్యం కలిగిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, 62 ఎంవీఏ కెపాసిటీ కలిగిన ఒక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు. గురువారం వర్చువల్ సీఎం చంద్రబాబు పనులు ప్రారంభిస్తారు.

నర్సీపట్నం, చోడవరం ప్రాంతాలకు ప్రయోజనాలు...

పరవాడ నుంచి కొరుప్రోలు 132 కేవీ సబ్ స్టేషన్‌కు, కొరుప్రోలు ఫీడర్ నుంచి నర్సీపట్నం 132 కేవీ సబ్ స్టేషన్‌కి విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఈదురుగాలుతో భారీ వర్షాలు పడినప్పుడు కొరుప్రోలు లైన్‌లో ఏదైనా సమస్య ఉత్పన్నమైతే నర్సీపట్నంలో గంటల తరబడి సరఫరా నిలిచిపోయేది. నర్సీపట్నం 132/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 33/11 కేవీ సబ్ స్టేషన్లు ఉన్నాయి. నిరంతర విద్యుత్ సరఫరా అనేది మూడు సబ్ స్టేషన్లకు మాత్రమే ఇవ్వగలుగుతున్నారు, 220 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే విత్యుత్ వెతలకు పూర్తిగా పరిష్కారం లభించనుంది.

220 కేవీ ఎగువ సీలేరు విద్యుత్ ఉప కేంద్రం, 220 కేవీ పెందుర్తి విద్యుత్ ఉప కేంద్రం, నర్సీపట్నం 220 కేవీ సబ్ స్టేషన్‌కి లైన్ కలుపుతారు. ప్రత్యామ్నాయ అవసరాలు కోసం కొరుప్రోలు ఫీడర్ కూడా ఉంచుతారు. చోడవరం 132/11 కేవీ సబ్ స్టేషన్‌కి కశింకోట ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుంది. దీనికి అదనంగా నర్సీపట్నం 220/132 విద్యుత్ ఉప కేంద్రం నుంచి కూడా లైన్ కలుపుతారు. దీనివల్ల చోడవరం ప్రాంతంలో విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయని అధికారులు చెబుతున్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో కశింకోట లైన్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయంగా నర్సీపట్నం లైన్ ఉపయోగపడుతుంది.

డివిజన్‌లో విద్యుత్ కనెక్షన్‌లు ఇవీ..

నర్సీపట్నం డివిజన్‌లో గృహ వినియోగదారులు 2,32,080 మంది ఉన్నారు. కమర్షియల్ కనెక్షన్‌లు 24648, పరిశ్రమలకు 940, ప్రభుత్వ కనెక్షన్‌లు 6671, వ్యవసాయ కనెక్షన్లు 22,213, హెటీటీ పరిశ్రమలు 58 మొత్తం 286609 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. నర్సీపట్నంలో 48 మెగావాట్లు, చోడవరంలో 38 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉంది. ప్రతీ సంవత్సరం పది శాతం వినియోగం పెరుగుతోంది. దీనికి తగ్గట్టు విద్యుత్ సబ్ స్టేషన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు పెంచుకోవాల్సి వస్తోంది.

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

-వీడీవీ రామకృష్ణ, ఈఈ, నర్సీపట్నం డివిజన్



220 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే నర్సీపట్నంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. లోవోల్టేజీ సమస్య ఉండదు. నిరంతరం విద్యుత్ సరఫరా జరుగుతుంది. చోడవరం ప్రాంతానికి కూడా దీనివల్ల ఎంతో మేలు చేకూరుతుంది.

గోవాడలో మద్యం దుకాణంపై రగడ

జనావాసాల మధ్య వద్దని ఎక్సైజ్ అధికారులకు తేల్చి చెప్పిన స్థానికులు



గోవాడలో ఎక్సైజ్ శాఖాధికారులను నిలదీస్తున్న స్థానిక ప్రజలు

చోడవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడ గ్రామంలో జనావాసాల మధ్య ఏర్పాటుచేసిన మద్యం దుకాణం తమకు వద్దంటూ స్థానికులు తేల్చి చెప్పారు. ఈ మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తూ జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు తదితరులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ ఎస్ఐ శేఖర్, సిబ్బంది బుధవారం గ్రామంలోకి వచ్చి మద్యం దుకాణం వద్ద విచారణ చేపట్టారు. దీనిపై అల్లం రామప్పారావుతో పాటు, స్థానికులు ఏడువాక నూకరాజు, బండి గోపి, శంకర్, వేపాడ అప్పారావు, కరణం శేఖర్ ఏడువాక శ్రీను, బండి బుజ్జి తదితరులంతా కలిసి , జనావాసాల మధ్య మద్యం దుకాణం వల్ల తామంతా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అధికార బలంతో జనావాసాల మధ్య దుకాణం వద్దని వేడుకున్నా వినకుండా బలవంతంగా కొనసాగించారని, కూటమి ప్రభుత్వం వచ్చాక తమ కష్టాలు తీరుతాయని భావించినా అధికారులు మళ్లీ అదే ప్రాంతంలో దుకాణం కొనసాగించడం దారుణమని స్థానిక ప్రజలు అధికారులతో వాదనకు దిగారు. మద్యం దుకాణంకు సమీపంలోనే గుడి, ఇళ్లు ఉన్నాయని, రోడ్డుపై బహిరంగంగా మద్యం తాగుతుండడం వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు విన్నవించినా స్పందించక పోవడం దారుణమని అల్లం రామప్పారావుతో పాటు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల మధ్య మద్యం దుకాణం తొలగించాలంటూ ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని, సరికదా ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణదారులకు అనుకూలంగా వ్యవహించడం దారుణమని వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే గ్రామం, నడిబొడ్డున ఉన్న మద్యం దుకాణం తొలగించాలని, లేనిపక్షంలో ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. దుకాణం తొలగించేంతవరకూ ఆందోళన కొనసాగుతుందని స్పష్ట చేశారు. దుకాణం ఏర్పాటుపై ప్రజల అభ్యంతరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎస్ఐ శేఖర్ ప్రజలకు చెప్పి అక్కడ నుంచి నిష్క్రమించారు.

నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధంకండి

టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

నాతవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ సూచించారు. స్థానిక వర్తక కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన కూటమి శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోపరేటివ్ బ్యాంకు ఎన్నికలకు కూడా ఇప్పటినుంచే సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే టీడీపీ సభ్యత్వాలను వేగవంతం చేయాలని కోరారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరక సత్యనారాయణ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేలో అనేక తప్పులు ఉన్నాయని, వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. బీజేపీ నర్సీపట్నం సమన్వయకర్త గవిరెడ్డి త్రినాథ్ మాట్లాడుతూ కూటమి నాయకులంతా సమన్వయంతో ముందుకు పోవాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు ఎన్.విజయ్‌కుమార్, ఎస్.సన్యాసి దేముడు, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ పి.కొండబాబు, కూటమి నాయకులు ఎ.మాణిక్యం, బి.సూరిబాబు, శెట్టి లోవ, పైల సూరిబాబు, ఇటంశెట్టి సీతారామ్మూర్తి, కొండ్రు మరిడియ్య, వి.వెంకటరమణ, శెట్టి నానాజీ, వి.సూర్యారావు, లాలం వెంకటరమణ, పి.బుల్లిదొర తదితరులు పాల్గొన్నారు.

పశుగణనను వినియోగించుకోండి



పశు వైద్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీ

చీడికాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పశుగణన కార్యక్రమాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ వి.చిట్టినాయుడు సూచించారు. తురువోలు గ్రామంలో పశుగణన కార్యక్రమాన్ని బుధవారం తనిఖీ చేశారు. అనంతరం పశు వైద్యశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఉచిత టీకాలు, మందులు, పశువైద్యం రైతులకు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం పెదగోగాడ, చీడికాడ పశువైద్య కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. యంత్రీకరణపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలని వైద్యాధికారులకు ఏడీ సూచించారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు

నర్సీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి 2023-24 విద్యా సంవత్సరంలో స్కూల్ టాపర్స్‌గా నిలిచిన ముగ్గురు విద్యార్థినులకు అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగదు పురస్కారం అందించింది. విద్యార్థినులు పూడి సాయిహర్షిని, నమ్మి హైమావతి 558 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా వారికి మొదటి బహుతిగా రూ.3500 చొప్పున, ద్వితీయ స్థానంలో నిలిచిన వారణాసి నవ్యకు రూ.3 వేలు అందజేశారు. అలాగే పాఠశాలలో వాచ్‌మన్ రూమ్‌కు ట్రస్టు తరఫున రూ.7 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లాడ సురేష్, హెచ్ఎం కేవీ రమణ పాల్గొన్నారు.

రైవాడ జలాశయంలోకి చేప పిల్లలు



జలాశయంలో చేప పిల్లలు విడుదల చేస్తున్న అధికారులు

దేవరాపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయంలోకి నాలుగు లక్షల చేప పిల్లలను బుధవారం విడుదల చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, మత్స్య శాఖ కమిషనర్ సూచన జేడీ పి.ప్రసాద్ ఆధ్వర్యంలో చేప పిల్లలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల వేటకు అనుమతి ఉన్న వారు మాత్రమే ఆరు నెలల తరువాత చేపలు పట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం డీడీ నిర్మలాకుమారి, తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీపీ బుల్లిలక్ష్మి, జడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించండి

జిల్లా రవాణా అధికారి పద్మావతి



సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న డీపీటీవో పద్మావతి

నర్సీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా రవాణా అధికారి కె.పద్మావతి సూచించారు. బుధవారం నర్సీపట్నం డిపో గ్యారేజ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గ్యారేజ్ సూపర్‌వైజర్లను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో బస్సుల సాంకేతికపరమైన లోపాలను అడిగి తెలుసుకొని, ఏడో తేదీలోగా పరిష్కరించి డ్రైవర్లకు తెలియజేయాలని సూచించారు. దీనివల్ల వారిలో ఆత్మ విశ్వాసం పెరిగి మరింత అంకిత భావంతో పనిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ ఇంజనీర్ పి.ఆచారి, ట్రాఫిక్ ఇన్‌చార్జి మోహనరావు, అనకాపల్లి అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజానికి కృషి చేద్దాం..



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కళావతి

కృష్ణాదేవిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పొగాకు రహిత సమాజం కోసం కృషి చేద్దామని సీహెచ్‌సీ వైద్యాధికారి కళావతి పిలుపునిచ్చారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. వ్యాధుల నియంత్రణకు మోగా సాధన చేయాలని సూచించారు. పొగాకు వల్ల వచ్చే ప్రమాదకరమైన క్యాన్సర్, ఇతర రోగాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ఎన్.హరిప్రవీణ్, ఎస్.గాయత్రి, వైద్య సిబ్బంది సావిత్రి, బీవీ సత్యనారాయణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వూషు పోటీలో జాహ్నవికి రజతం



విద్యార్థినికి జ్ఞాపిక అందిస్తున్న కరస్పాండెంట్ సతీశ్

నర్సీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రిషి కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కరణం జాహ్నవి ఈ నెల 3, 4 తేదీలలో శ్రీకాకుళంలో జరిగిన అండర్-19 రాష్ట్ర స్థాయి వూషూ టోర్నమెంట్‌తో రజత పతకం సాధించారు. బుధవారం కళాశాల ఆవరణలో కరస్పాండెంట్ కోనా సతీష్ విద్యార్థిని జాహ్నవికి పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జులు ఎ.భాస్కర్, టీవీఎస్ఎల్ రాజు పాల్గొన్నారు.

మాడుగులలో దట్టంగా మంచు



ఎంకె.వల్లాపురం రోడ్డుపై మంచు

మాడుగుల రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం, శీతాకాలం ప్రారంభం కావడంతో రెండు రోజులుగా మైదాన ప్రాంతంలో మంచు వాతావరణం నెలకొంది. ఇప్పుడిప్పుడే పల్లెల్లో మంచు దుప్పటి కప్పుకుంటూ చలి వాతావరణం నెలకొంటున్నది. తెలతెలవారుతుండగా మంచు కమ్మేయడంతో ఏజెన్సీ ప్రాంత వాతావరణాన్ని తలపిస్తోంది. మంచు తెరలను చీల్చుకుంటూ ప్రసరించే సూర్యకిరణాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. మంచు కురుస్తుండడంతో స్థానికులు పరవశిస్తున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

నర్సీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యా/వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మఒడి బకాయిలు చెల్లించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు పి.జనార్ధన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. ఫీజులు కట్ట లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, కళాశాల యాజమాన్యాలు హాల్ టిక్కెట్లు ఇవ్వమని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వరహాలు, విష్ణు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరికి గింజ కట్టే దశలో నీరు సమృద్ధిగా అందించాలి

గొలుగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరి పొలంలో గింజ కట్టే దశలో నీరు సమృద్ధిగా అందించాలని మంల వ్యవసాయాధికారి సుధారాణి రైతులకు సూచించారు. మండలంలోని నాగందొరపాలెం, జమ్మదేవిపేట గ్రామాల్లో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన పెంచుకోవాలన్నారు. చీడపీడలపై మందుల పిచికారీ చేయాలంటే వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. వచ్చే రబీకి అపరాల విత్తనాలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేముడుబాబు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మపేటలో రీ సర్వే సమస్యలపై 22 దరఖాస్తులు

గొలుగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మపేట గ్రామంలో రీ సర్వే సమస్యలపై 22 దరఖాస్తులు వచ్చినట్టు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కొండబాబు తెలిపారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన సభలో బాధితులు వినతులు అందించారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని డీటీ చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట

చీడికాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శంకరరావు, మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు చెప్పారు. ఈ మేరకు కోనాంలో బుధవారం పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పోరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.ఈ నెల 14న సచివాలయాలు, 15న మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనా అధికారులుగా పదోన్నతులు కల్పించారు. వీరిలో ఎన్వీహెచ్ఆర్ స్వామి రావికమతం మండల పరిపాలనాధికారిగా నియమించారు. ఈ మేరకు జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సీఈవో పి.నారాయణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

దేవరాపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేపల్లి, చేనులపాలెం గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చురుగ్గా సాగుతోంది. టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కిల్లి గోవింద, నాయకులు శ్రీనివాసరావు, రొంగలి పెంటయ్య తదితరులు బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు.

లచ్చన్నపాలెంలో పొలం పిలుస్తోంది

మాకవరపాలెం: మండలంలోని లచ్చన్నపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి సాగు పొట్ట దశలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా ఏవో చిరంజీవి వివరించారు. ఈ నెల 15లోగా జీడిమామిడి రైతులు బీమా చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేత పి.రాంబాబు పాల్గొన్నారు.

అవగాహనతోనే రక్షణ!

కేన్సర్ గుర్తింపులో పరీక్షలు కీలకం

- సకాలంలో గుర్తిస్తే ప్రాణాలకు భరోసా
- మూడు, నాలుగు దశల్లో తప్పని ప్రాణాపాయం
- దేశంలో ఏటా 1.1 మిలియన్ కేసులు

నేడు జాతీయ కేన్సర్ అవగాహన దినం



విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

కేన్సర్ విజృంభిస్తోంది. ఏటా దేశంలో లక్షలాది మంది వ్యాధి బారినపడుతున్నారు. అదే స్థాయిలో మరణాలూ సంభవిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం వ్యాధి పట్ల అవగాహన లేకపోవడమేనని నిపుణులు చెబుతున్నారు. వ్యాధి ముదిరిన తరువాత ఆస్పత్రులకు రావడంతో ప్రాణాలను కాపాడే పరిస్థితి లేకుండా పోతోందని చెబుతున్నారు. ప్రాథమిక దశలో కేన్సర్‌ను గుర్తిస్తే సాధారణ జీవితం గడిచే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. మూడు, నాలుగు దశల్లో వస్తే జీవితకాలాన్ని కొంతవరకు పెంచగలమని, ప్రాణాలను కాపాడలేమంటున్నారు. ప్రజల్లో కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా అక్టోబరు ఏడో తేదీన జాతీయ కేన్సర్ అవగాహన దినంగా నిర్వహిస్తున్నారు.

దేశంలో ఏటా కేన్సర్ బారినపడుతున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. గతంలో 50 ఏళ్లు దాటిన వారిలో మాత్రమే ఈ వ్యాధి కనిపించగా, ఇటీవల 40 ఏళ్లు దాటిన వారిలోనూ గుర్తిస్తున్నారు. కేన్సర్‌కు అనేక అంశాలు కారణమవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. దేశంలో ఏటా 1.1మిలియన్ కొత్త కేన్సర్ కేసులు నమోదవుతుండగా, అందులో సుమారు ఐదు లక్షల మంది మృత్యువాత పడుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వ్యాధి పట్ల అవగాహన లేకపోవడమే దీనికి కారణమని తేల్చారు.

తొలిదశలో గుర్తిస్తే 98 శాతం నయం

ఏ కేన్సర్ అయినా తొలిదశలో గుర్తిస్తే 98 శాతం ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. లక్షణాలు కనిపించకుండానే స్క్రీనింగ్ పరీక్షల్లో కేన్సర్ కణాలను గుర్తించే అవకాశం ఉంది. దీనిని జీరో స్టేజ్‌గా చెబుతారు. ఈ దశలో వ్యాధిని గుర్తిస్తే 99 శాతం వరకు ప్రాణాలను కాపాడవచ్చు. కొన్ని కేసులను ప్రాథమిక దశలో గుర్తించవచ్చు. ఈ దశలో మెరుగైన చికిత్స తీసుకుంటే 95 నుంచి 98 శాతం ప్రాణాలు కాపాడవచ్చు. రెండో దశలో గుర్తిస్తే 70 శాతం, మూడో దశలో గుర్తిస్తే 50 శాతం మాత్రమే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. నాలుగో దశలో గుర్తిస్తే పది శాతం కంటే తక్కువ మందిని ఐదేళ్లపాటు జీవించేలా చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

ఇదీ ఉద్దేశం...

వ్యాధి పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, కేన్సర్ పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు వచ్చేలా చేసే ఉద్దేశంతో జాతీయ కేన్సర్ అవగాహన దినం నిర్వహిస్తున్నారు. సమయానికి వ్యాధిని గుర్తించడం, నిర్ధారించే పరీక్షలు చేయడం, మెరుగైన వైద్య సేవలు అందించడమే దీని ప్రధాన లక్ష్యం. ఇందుకోసం వివిధ స్వచ్ఛంద సంస్థలు, వైద్యసేవలు అందించే ఆస్పత్రులు, ఇతర ఆర్గనైజేషన్స్‌తో కలిసి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వాక్‌థాన్, ర్యాలీలు, అవగాహన సదస్సులు చేపడుతున్నారు.

గుర్తించడమే చికిత్సలో కీలకం..

కేన్సర్ అనగానే చాలా మంది భయపడుతుంటారు. నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు ముందుకురారు. ఇది ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. కొన్ని లక్షణాలను బట్టి అనుమానాలను వ్యక్తం చేయాలి. వైద్యుల సూచనల మేరకు పరీక్షలు చేయించుకుంటే వ్యాధిని ముందుగానే గుర్తించే వీలుంటుంది. చాలా మంది వైద్యులు సూచనలు పట్టించుకోవడం లేదు. అలాగే రొమ్ము, సర్వైకల్ కేన్సర్‌ను నిర్ధారించే పరీక్షలను 40 ఏళ్లు దాటిన మహిళలు లక్షణాలతో సంబంధం లేకుండా ఏడాదికి ఒకసారి చేయించుకుంటే మెరుగైన ఫలితం ఉంటుంది. ఒకవేళ కేన్సర్ కారక కణాలుంటే వేగంగా గుర్తించి, చికిత్స అందించే అవకాశం ఉంటుంది. కేన్సర్‌తో బాధపడేవారిలో సుమారు 90 శాతం మంది మూడు, నాలుగు దశల్లోనే వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు.

పరీక్షలంటేనే భయపడుతున్నారు



కేజీహెచ్‌లో డిజిటల్ మామోగ్రఫీ పరికరంతో రొమ్ము కేన్సర్‌ను అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో నిర్ధారించే అవకాశం ఉంది. ఈ పరీక్షకు బయట రూ.4 వేల వరకు అవుతుంది. ఇక్కడ ఓపీ టికెట్ లేకుండా ఉచితంగా చేస్తున్నాం. గైనకాలజీ వైద్యులు సూచిస్తున్నా చాలామంది ముందుకు రావడంలేదు. ప్రతిరోజూ ఐదుగురు మాత్రమే వస్తున్నారు. రోజూ 30 మందికి పరీక్షలు చేసే సామర్థ్యం ఉంది. ఎటువంటి లక్షణాలు లేని సమయంలోనే పరీక్ష చేయించుకుంటే వ్యాధిని గుర్తించే అవకాశం ఉంది. చాలా మంది రొమ్ములో కణితులు ఏర్పడినప్పుడు, రక్తం, చీము కారినప్పుడు వస్తున్నారు. అప్పటికే వ్యాధి మూడు, నాలుగు దశల్లోకి వెళ్లిపోతోంది. ఇది అత్యంత ప్రమాదకరం. మిగిలిన కేన్సర్లకు స్క్రీనింగ్స్ అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ బుజ్జిబాబు,
రేడియాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

అపోహలతోనే ప్రమాదం



కేన్సర్ స్క్రీనింగ్ చేయించుకునేందుకు చాలామంది భయపడుతుంటారు. శరీరం లో కేన్సర్ కణాలు ఉంటేనే బయటపడుతుంది. అపోహలు వీడితే మేలు. కేజీహెచ్‌లో సర్వైకల్ కేన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నాం. ప్రతిరోజూ 20 మందికి ఉచితంగా స్క్రీనింగ్ చేస్తున్నాం. 1.47 శాతం మందికి మాత్రమే తదుపరి దశ పరీక్షలు చేయించాల్సి వస్తోంది. ఒకటికి రెండుసార్లు కౌన్సెలింగ్ ఇస్తేనే మహిళలు ముందుకువస్తున్నారు. రీ ప్రొడక్టివ్ ఏజ్ గ్రూప్ వారికి పరీక్ష చేయవచ్చు. దీనివల్ల మేలు జరుగుతుంది. కేన్సర్లను సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్య సేవలు అందించవచ్చు.

- డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి,
గైనకాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

క్రైం... crime news

విద్యుదాఘాతంతో ఒకరి మృతి: మరొకరికి గాయాలు

- వంజంగి రిసార్ట్స్‌లో విషాదం



మృతి చెందిన ఉదయ్ కిరణ్



గాయపడిన సాయి కిరణ్

పాడేరురూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాడేరు మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన వంజంగిలోని ఓ రిసార్ట్‌లో బుధవారం ఉదయం విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతి చెందగా, మరో యువకుడికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి సీఐ డి.దీనబంధు తెలిపిన వివరాలివి. పర్యాటకుల కోసం వంజంగిలో నడుపుతున్న ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో పనిచేస్తున్న రేగం ఉదయ్ కిరణ్, సాయికిరణ్ బుధవారం ఉదయం ఇనుప నిచ్చెనను ఒక ప్రదేశం నుంచి మరోచోటకు తరలిస్తున్న సమయంలో విద్యుత్ తీగలకు అది తగలడంతో వారు విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయారు. దీంతో తోటి సిబ్బంది వారిని స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఉదయ్‌కిరణ్ మృతి చెందగా, సాయికిరణ్ కోలుకున్నట్టు సీఐ తెలిపారు. మృతి చెందిన ఉదయ్‌కిరణ్‌ది మండలంలోని డేగల వీధి కాగా, గాయపడిన సాయికిరణ్‌ది వంజంగి గ్రామమని గుర్తించామన్నారు. ఉదయ్ కిరణ్ మృతదేహానికి గురువారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని సీఐ తెలిపారు. ఈ ఘటనపై ఎస్ఐ ఎ.సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివిధ చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు

అనకాపల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పాయకరావుపేట, పరవాడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన పలు చోరీ కేసుల్లో ముగ్గురిని అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ కేసులకు సంబంధించి వివరాలను ఆయన వెల్లడించారు. పరవాడలో పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ కేసుకు సంబంధించి మారేడుపూడి పంచాయతీ శివారు జొన్నవానిపాలెం గ్రామానికి చెందిన ఓ నిందితుడిని అరెస్టు చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పాయకరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు కేసులకు సంబంధించి తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన ఓ నిందితుడిని, పాయకరావుపేట మండలం గ్యాలంవీధి, అనకాపల్లి జిల్లాకు చెందిన మరో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన చెప్పారు. ఆ రెండు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఐదు కేసులకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు 2,31,024 రూపాయల విలువ గల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ క్రైమ్ మోహనరావు, పరవాడ సీఐ మల్లికార్జునరావు, పరవాడ ఎస్ఐ బొలుపద్ర కృష్ణారావు, పాయకరావుపేట ఎస్ఐ జుట్టు పురుషోత్తం పాల్గొన్నారు.

కుమారుడిపై తండ్రి గొడ్డలితో దాడి

- తీవ్రంగా గాయపడడంతో కేజీహెచ్‌కి తరలింపు



తీవ్రంగా గాయపడిన రాజేశ్

కొత్తూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కుమారుడిపై తండ్రి గొడ్డలితో దాడి చేసిన సంఘటన అనకాపల్లి మండలం గోపాలపురం పంచాయతీ వెంకటరమణపేట గ్రామంలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలివి. వెంకటరమణపేట గ్రామానికి చెందిన మొలుగు సూరిఅప్పారావు తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి రాజేశ్ అనే కుమారుడు ఉన్నాడు. అతను కూడా తాపీ పని చేస్తుంటాడు. అయితే రాజేశ్ కొద్ది రోజులుగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఎన్నిసార్లు చెప్పినా మాట వినకపోవడంతో పెళ్లికి ముందు నేనే, పెళ్లి అయిన తరువాత నేనే అందరినీ పోషించాలంటే ఎలా సాధ్యపడుతుందని అతని తండ్రి అసహనం వ్యక్తం చేశాడు. చెప్పిన మాట వినకపోవడంతో క్షణికావేశంలో పక్కనే ఉన్న గొడ్డలితో కొడుకు రాజేశ్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో రాజేశ్ తల, ఛాతీపై, కుడికన్నుపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

మత్స్యగెడ్డలో గిరిజనుడి గల్లంతు



సొంబ్రన్న (ఫైల్ ఫొటో)

ముంచంగిపుట్టు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుజనకోట పంచాయతీ గొడుగులపుట్టు గ్రామానికి సమీపంలో మత్స్యగెడ్డలో చేపల వేటకు వెళ్లిన గిరిజనుడు నీటమునిగి గల్లంతయ్యాడు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. గొడుగులపుట్టుకు చెందిన పి.సొంబ్రన్న(49) రోజూ మాదిరిగానే బుధవారం నాటుపడవపై మత్స్యగెడ్డలో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ నీటిలో పడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే గెడ్డవద్దకు వెళ్లారు. కానీ సొంబ్రన్న అప్పటికే నీటిలో మునిగిపోయాడు. సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ లభించలేదు. సొంబ్రన్నకు భార్య, కుమారుడు ఉన్నారు.

దేవరాపల్లిలో కారు బీభత్సం

- పోలీసు చెక్‌పోస్టు వద్ద ఆపకుండా ఉడాయించిన అగంతకులు
- ప్రమాదం తరువాత కారు వదిలేసి పరారీ
- గంజాయి రవాణా చేస్తున్నట్టు అనుమానం



ఎక్స్‌కవేటర్‌తో కారును తరలిస్తున్న పోలీసులు

దేవరాపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లిలో ఓ కారు బీభత్సం సృష్టించింది. అల్లూరి జిల్లా నుంచి దేవరాపల్లి వైపు వస్తున్న కారును శ్రీరాంపురం వై జంక్షన్ చెక్ పోస్టు వద్ద పోలీసులు అడ్డుకోగా, డ్రైవర్ ఆపకుండా మెరుపువేగంతో దూసుకుంటూ వెళ్లిపోయాడు. కొద్ది దూరం వెళ్లిన తరువాత టైరుకు పంకర్ కావడంతో కారును అక్కడే వదిలేసి పరారయ్యారు. ఎస్ఐ టి.మల్లీశ్వరరావు తెలిపిన సమాచారం మేరకు.. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి గంజాయి రవాణాను అడ్డుకోవడానికి దేవరాపల్లి సమీపంలోని శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద ఇటీవల పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అనంతగిరి మండలం నుంచి దేవరాపల్లి వైపు వచ్చే అన్ని రకాల వాహనాలను ఇక్కడ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో అనంతగిరి మండలం వైపు నుంచి వస్తున్న ఒడిశా రిజిస్ట్రేషన్ నంబరుతో వున్న కారును ఆపడానికి పోలీసులు ప్రయత్నించారు. అయితే డ్రైవర్ ఆపకుండా వేగం మరింత పెంచి ముందుకు దూసుకుపోయాడు. దీంతో పోలీసు సిబ్బంది వెంటనే అప్రమత్తమై మరో వాహనంలో వెంబడించారు. ఇదే సమయంలో ఎస్ఐ మల్లీశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. ఆయన నాలుగు రోడ్ల జంక్షన్‌లో ట్రాక్టర్‌ను అడ్డంగా పెట్టారు. అయినప్పటికీ కారు డ్రైవర్ ట్రాక్టర్‌ను తప్పించుకుని ముందుకుపోనిచ్చాడు. ఈ క్రమంలో టీటీడీ కల్యాణ మండపం వద్దకు వెళ్లేసరికి కారు టైరు పంక్చరైంది. దీంతో కారును ఆపి డ్రైవర్‌తోపాటు కారులో వున్న వ్యక్తులు పరారయ్యారు. పోలీసులు చేరుకుని కారుని స్టేషన్‌కు తరలించారు. దీనిలో గంజాయి రవాణా చేస్తున్నట్టు స్థానికులు అనుమానంగా వ్యక్తం చేస్తున్నారు. కాగా దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలను గురువారం వెల్లడిస్తామని ఎస్ఐ చెప్పారు.

జాబ్ స్కామ్ కేసులో మల్కాపురం వాసి అరెస్టు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కంబోడియా, మయన్మార్, బ్యాంకాక్ తదితర ప్రాంతాల్లో ఉద్యోగాల పేరిట భారతీయులను మోసం చేస్తున్న విశాఖ నగరంలోని మల్కాపురానికి చెందిన దాసరి వెంకటరాఘవపార్థసారథిని సైబర్ క్రైమ్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి కీలక సమాచారాన్ని రాబట్టారు. వారు అందించిన వివరాల ప్రకారం...వెంకటరాఘవపార్థసారథి గతంలో పలు దేశాల్లో వెల్డింగ్ పనులు చేసేవాడు. కొద్దికాలం తరువాత తిరిగి ఇండియాకు వచ్చేశాడు. అతడికి చుక్క రమేష్ అనే వ్యక్తితో పరిచయమైంది. కంబోడియా వంటి దేశాలకు నిరుద్యోగులను పంపిస్తే మంచి కమీషన్ వస్తుందని వెంకటరాఘవ చెప్పడంతో ముగ్గురిని రమేష్ వివిధ దేశాలకు పంపించాడు. వెంకటరాఘవ కూడా కంబోడియాకు వెళ్లి కుక్‌గా స్థిరపడ్డాడు. అప్పటి నుంచి రమేష్ ద్వారా భారత్ నుంచి వచ్చిన వారిని రిసీవ్ చేసుకుని, ఫిలిప్పీన్స్‌కి చెందిన ఆర్య హబీబ్‌తో కలిసి చైనా కంపెనీలకు పంపించేవాడు. ఇలా 12 మందిని చైనా స్కామ్ కంపెనీలకు పంపాడు. ఈ కేసులో ఇప్పటికే చుక్కా రమేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు పార్థసారథిపై నిఘా పెట్టారు. అతడు కంబోడియా నుంచి బ్యాంకాక్, అక్కడి నుంచి భువనేశ్వర్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడన్న సమాచారంతో అక్కడి అధికారులను అప్రమత్తం చేశారు. భువనేశ్వర్ ఎయిర్‌పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారులు బుధవారం పార్థసారథిని అడ్డుకుని, విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతడిని అరెస్టు చేసి విశాఖ తీసుకువచ్చి, రిమాండుకు తరలించారు.

ఉజ్బెకిస్తాన్‌లో గాజువాక వాసి మృతి



కొప్పనాతి ఆనంద్ (ఫైల్ ఫొటో)

గాజువాక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం ఉజ్బెకిస్తాన్ వెళ్లిన గాజువాక వాసి అక్కడ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఇందుకు సంబంధించి ఆయన కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని యాతపాలెం ప్రాంతానికి చెందిన కొప్పనాతి ఆనంద్ (43) వెల్డర్. ఉపాధి నిమిత్తం గాజువాక ఆటోనగర్‌లో గల ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఆగస్టు 31వ తేదీన ఉజ్బెకిస్తాన్ వెళ్లారు. ఈ నెల రెండో తేదీ రాత్రి పది గంటలకు ఫోన్‌లో కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మరుసటి రోజు ఉదయం అక్కడ నుంచి ఒకరు ఆనంద్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అతను చనిపోయినట్టు చెప్పారు. దీంతో వారు ఆనంద్ పనిచేస్తున్న సంస్థ అధికారులను ఫోన్‌లో సంప్రతించేందుకు యత్నించగా స్పందించలేదు. గాజువాకలో గల ఏజెన్సీ ప్రతినిధులు కూడా తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని ఆనంద్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆనంద్ ఎలా చనిపోయాడో తెలియడం లేదని, తమకు పలు అనుమానాలు ఉన్నాయని బుధవారం న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై న్యూపోర్టు సీఐ దాలిబాబును సంప్రతించగా సంబంధిత ఏజెన్సీ ప్రతినిధితో మాట్లాడామన్నారు. మృతదేహం రహదారిపై ఉందని, రోడ్డు ప్రమాదం అయి ఉండవచ్చునని సమాచారం ఉందన్నారు. అక్కడ పోలీసుల దర్యాప్తులో వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

యోగా సాధనతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న రిత్‌దేవ్‌జీ మహరాజ్

అనకాపల్లి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో వ్యాధులు దూరమవుతాయని ప్రముఖ యోగా గురువు రిత్‌దేవ్‌జీ మహరాజ్ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో రెండో తేదీ నుంచి నిర్వహిస్తున్న యోగా శిక్షణా శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మనిషికి శారీరక వ్యాయామం అవసరమన్నారు. యోగాసనాలు వేయడం వల్ల షుగర్, బీపీ వంటి వ్యాధులు దూరమవుతాయన్నారు. చక్కెర వ్యాధిగ్రస్థులు కాకరకాయ, కీరా, టమాటా జ్యూస్ తయారుచేసుకుని ఉదయాన్నే పరగడుపున ఒక గ్లాస్ తాగినట్టయితే షుగర్ అదుపులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక యోగా గురువు భీశెట్టి దొరమ్మనాయుడు, మంగయ్య, జార్జిక్లబ్ అధ్యక్షులు బీఎస్ఎంకే జోగినాయుడు, కోలపర్తి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

సింహాద్రి రెండో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో ఉత్పత్తికి బుధవారం అంతరాయం ఏర్పడింది. ఇదే యూనిట్‌కు సంబంధించి బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి అర్ధాంతరంగా నిలిచిపోయింది. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించారు. కాగా మిగతా ఒకటి, మూడు, నాలుగు యూనిట్‌ల్లో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతున్నదని అధికారులు తెలిపారు.

రెచ్చిపోతున్న ఇసుకాసురులు

... 5వ పేజీ తరువాయి

వేసుకున్నా.. దళారులు రూ.80 వేల వరకు సంపాదిస్తున్నారు.

జరిమానాలు విధిస్తున్నా...

ఇసుక వ్యాపారం ద్వారా ఇబ్బడిముబ్బడిగా ఆదాయం వస్తుండడంతో అధికారులు జరిమానాలు విధిస్తున్నప్పటికీ దళారులు, లారీల యజమానులు లెక్కచేయడంలేదు. ఈ నెల ఒకటో తేదీ రాత్రి తహసీల్దార్ జనార్దన్ ఐదు ఇసుక లారీలు పట్టుకున్నారు. ఇసుక పరిమాణాన్నిబట్టి ఒక లారీకి రూ.10 వేలు, రెండు లారీలకు రూ.15 వేల చొప్పున, మరో రెండు లారీలకు రూ.20 వేల చొప్పున జరిమానా విధించారు. అయినప్పటికీ పుష్కలంగా ఆదాయం వస్తుండడంతో ఇసుక అక్రమ వ్యాపారాన్ని ఆపడంలేదు.

మాటతప్పిన అభిజిత్ యాజమాన్యం

... 5వ పేజీ తరువాయి

కర్మాగారం వద్దకు వచ్చారు. కానీ యాజమాన్యం లేఆఫ్ ఎత్తివేస్తున్నట్టు నోటీసు పెట్టలేదు.. గేట్లు తెరవలేదు. కార్మికులు సాయంత్రం నాలుగు గంటల వరకు వేచి చేసి, నిరాశతో తిరుగుముఖం పట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటీశ్వరరావు మాట్లాడుతూ, ఎమ్మెల్యే సమక్షంలో జరిగిన చర్చల్లో బుధవారం నుంచి కర్మాగారాన్ని తెరుస్తామని యాజమాన్య ప్రతినిధులు ప్రకటించారని, కానీ చెప్పిన మాటను తుంగలో తొక్కారని విమర్శించారు. కార్మికులకు ముందస్తుగా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా లేఆఫ్ ప్రకటించిన యాజమాన్యంపై అప్పుడే చర్యలు తీసుకుని వుంటే సమస్య ఇంతవరకు వచ్చేది కాదన్నారు. అభిజిత్ కర్మాగారాన్ని వెంటనే తెరిపించాలని, లేదంటే ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రెడ్డి మాస్టారుకి కన్నీటి వీడ్కోలు

... 5వ పేజీ తరువాయి

తెలుగుదేశం పార్టీ పతాకాన్ని రెడ్డి సత్యనారాయణ భౌతికకాయంపై వుంచి నివాళులు అర్పించారు. ఇంకా స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి, తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం భౌతికకాయాన్ని ప్రభుత్వ లాంఛనాలతో శ్మశానవాటికకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. పోలీసులు గౌరవ సూచికంగా గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి, తుపాకులను అవనతం చేశారు. రెడ్డి సత్యనారాయణ కుమారుడు రాము చితికి నిప్పంటించారు. రెడ్డి సత్యనారాయణను కడసారి చూసేందుకు నియోజవర్గంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు బంధువులు పెద్దఎత్తున తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు.

అన్నదాతలకు అండగా..

... 5వ పేజీ తరువాయి

కంపెనీలను ప్రభుత్వం ఎంపిక చేసింది. రైతులు తమ వాటా సొమ్మును 'డీఎంఐఓ అనకాపల్లి, యాక్సిస్ బ్యాంకు ఖాతా నంబరు 920010056935585, ఐఎఫ్ఎసీ కోడ్: యూటీఐబీ 0001730కు లేదా, ఆర్‌టీజీఎస్, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా కూడా నగదు బదిలీ చేయవచ్చు.

3,600 హెక్టార్లకు పరికరాలు

జిల్లాలో ఈ ఏడాది (2024-25) 3,600 హెక్టార్లకు బిందు, తుంపర సేద్యం పరికరాలను అందజేస్తారు. ఇప్పటికే 2,611 హెక్టార్లలో పరికరాల కోసం 2,419 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. సూక్ష్మ సేద్య అధికారులు 508 హెక్టార్లకు సంబంధించి 529 మంది రైతుల దరఖాస్తులను పరిశీలించారు. 65 హెక్టార్లకు సంబంధించి 78 దరఖాస్తులను ఆమోదించారు.